



19 వ వసంతంలోకి ...

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

ఎన్టీఆర్ కృష్ణా

గురువారం 12 ఫిబ్రవరి 2026 పేజీలు 8



# లంచంతోనే పని..!

- నందిగామ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో భారీ అక్రమ వసూల్
- అన్నీ ఉన్న ఆ అధికారిని ప్రసన్నం చేయాల్సిందే.!
- ప్రభుత్వ చలానా కంటే ఆ అధికారి చలానానే అధికం
- గగ్గోలు పెడుతున్న బాధితులు... చోద్యం చూస్తున్న ఉన్నతాధికారులు
- అ.ని.శా అధికారులపై అనేక ఆరోపణలు

**జగ్గయ్యపేట/నందిగామ ఫిబ్రవరి 11 మేజర్ న్యూస్ :** ఎన్టీఆర్ జిల్లాలో ఏ సబ్ రిజిస్ట్రార్ వసూళ్లు చేయని విధంగా అధిక అక్రమ వసూళ్లను నందిగామ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో వసూళ్లు చేస్తున్నారని ప్రజలు బహిర్గతంగానే చర్చించుకుంటున్నారు. డాక్యుమెంట్‌కి సంబంధించిన సమాచారం మొత్తం ఉన్నప్పటికీ ఆ 2



## గుణదల మేరీమాత పుణ్యక్షేత్రం

# మత సామరస్యానికి ప్రతీక

రాబోయే ఏడాది మరింత వైభవంగా ఉత్సవాలు జరిపించేందుకు కృషి చేస్తాం : ఎంపీ కేశినేని శివనాథ్

గుణదల మేరీమాత ఉత్సవాల ముగింపు వేడుకల్లో పాల్గొన్న ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

**విజయవాడ మేజర్ న్యూస్ :** తమిళనాడు వేళాంగిణి మేరీమాత ఉత్సవాల తరహాలో వచ్చే ఏడాది మరింత వైభవంగా, విజయవాడ నగర శోభ మరింత పెరిగే విధంగా గుణదల మేరీమాత ఉత్సవాలు నిర్వహించేందుకు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌తో కలిసి **మిగతా 2లో...**

# 20 నెలల్లో

## కూటమి సూపర్ హిట్ పాలన



- 90% సూపర్ సిక్స్ హామీలు అమలు
- ప్రజల్లో పూర్తి సంతృప్తి, స్వర్ణాంధ్ర విజన్ @2047
- అభివృద్ధి దిశగా దృఢ సంకల్పం
- ఎమ్మెల్యే బొండా ఉమా

7

## మహాశివరాత్రి పర్వదిన సందర్భంగా

# అప్రమత్తంగా ఉండండి



- ఏ దేవాలయాల్లోను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకూడదు
- భక్తులకు కావలసిన ఏర్పాట్లు సజావుగా అందాలి
- సమన్వయంతో పని చేయండి
- కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ

2 లో

**కృష్ణాజిల్లా స్టాఫ్ రిపోర్టర్ మేజర్ న్యూస్ :** మహాశివరాత్రి పర్వదిన సందర్భంగా జిల్లాలోనీ ఏ దేవాలయాల్లోను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా

## నేటి ప్రతిపాదిత సమ్మెలో పాల్గొనడం లేదు



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** ఫిబ్రవరి 12న జరిగే ప్రతి పాదిత సమ్మెలో పాల్గొనడం లేదని భారతీయ మజ్దూర్ సంఘ్ అనుబంధంగా ఉన్న ఆల్ ఇండియా లైఫ్ ఇ న్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సెంట్రల్ కమిటీ సభ్యులు అద్దంకి సాంబశివరావు బుధవారం ఒక ప్రక టనలో తెలిపారు. ఉద్యోగులు సంస్థ ప్రయోజనాలను కాపాడుతూ, నిర్మాణాత్మక సంభాషణ, చర్చ, చట్టపరమైన మార్గాల ద్వారా సమస్యలను పరిష్కరించాలని ఆల్ ఇండియా లైఫ్ ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ విశ్వసిస్తుంది. ఈ విధానానికి అనుగుణంగా, మా సంఘం అన్ని నిజమైన డిమాండ్లను సముచితమైన, శాంతియుత మార్గాల ద్వారా కొనసాగిస్తుంది. కాబట్టి, అన్ని యూనిట్లు, సభ్యులు ఫిబ్రవరి 12న తమ విధులకు క్రమం తప్పకుండా హాజరుకావాలని, మును పటిలాగా తమ బాధ్యతలను నిర్వర్తించాలని ఆయన అభ్యర్థించారు.

## ముక్తికాంత ముక్తేశ్వర స్వామివారికి వెండి విరాళం



**హనుమాన్ జంక్షన్, ఫిబ్రవరి 11, మేజర్ న్యూస్ :** బాపులపాడు మండలం పెరికీడు గ్రామంలోని శ్రీ ముక్తికాంత ముక్తేశ్వర స్వామివారి దేవస్థానానికి మచిలీపట్నంకు చెందిన శివ లెంక విద్యాసాగర్, అమ్మ తవల్లి జ్ఞాపకార్థం వారి కుమారులు శివ శంకర్, నగేష్, మహేష్, కుమార్తెలు బాలభ్రమర, లలితలు రూ.3,50,000 విలువైన 1,250 గ్రాముల వెండి అభరణాలను బుధవారం దేవస్థాన కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు దాత కుటుంబానికి కృతజ్ఞతలు తెలిపారు. దేవాలయ అభి వృద్ధికి ఈ విరాళం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నక్కా బాబు, కొల్లిమర్ల వెంకట రంగారావు, పుట్టి కోటేశ్వరరావు, నండూరి సత్య వేంకటేశ్వర శర్మ, పుట్టి వీర్రాజు, అర్చకులు కుందుర్తి శ్యామ్, కుందుర్తి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యర్థాలను బహిరంగ ప్రదేశాలలో వేయరాదు



**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** ఫిబ్రవరి 12వ తేదీన అనగా గురువారం దేశవ్యాప్తంగా పారిశుద్ధ్య కార్మికులు సమ్మెలో పాల్గొంటున్నందున విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలోని ప్రజలు తమ వ్యర్థాలను బహిరంగ ప్రదేశాలలో వేయరాదని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర బుధవారం నాడు విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఫిబ్రవరి 12న కార్మికుల సమ్మె ఉన్నందున నగరంలోని కంపాక్టర్ బిన్స్ లోని వ్యర్థాలను ముందు రోజు తొలగించేటట్టు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. నగర పరిధిలోని పారిశుద్ధ్య కార్మికులు గురువారం సమ్మెలో పాల్గొనే అవకాశాలు ఉన్నందున, విధులకు హాజరు కానీ పక్షంలో, ప్రజలు ఆరోజు వ్యర్థాలను బహిరంగ ప్రదేశాలలో పడవేయరాదని, మరుచటి రోజు అనగా ఫిబ్రవరి 13 శుక్రవారం తమ వద్దకు వచ్చే పారిశుధ్య కార్మికులు క్లాప్ వాహనాల ద్వారా వ్యర్థాలను సేకరిస్తారని కమిషనర్ నగర ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# లంచంతోనే పని..!

(మొదటిపేజీ తరువాయి)

అధికారిని ప్రసన్నం చేయకపోతే ఆ ఫైల్‌కు కొర్రే. ఈ కార్యాలయంలో ఏ పని జరగాలన్న ప్రభుత్వ చలానా కంటే 'ఆ అధికారికి' చెల్లించే అనధికార చలానానే ఎక్కువగా ఉందని బాధితులు గగ్గోలు పెడుతున్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ద్వారా జరిగే ప్రతి పనికి ప్రభుత్వం ఒక రేటును నిర్ణయించి ఆ రేటును ఆన్లైన్ ద్వారా నగదును చలానా రూపంలో చెల్లించి ఆ చెల్లించిన చలానా రసీదులను ఆ అధికారికి చూపిస్తే ఆ కార్యాలయ అధికారి సిబ్బంది పని చేయవలసి ఉంటుంది కానీ ఈ కార్యాలయంలో మాత్రం ఆన్లైన్లో చలానా కట్టిన కూడా అనధికారకంగా ప్రభుత్వ చలానా కంటే 'ఆ అధికారికి' అధిక మొత్తంలో ముడుపులు చెల్లిస్తేనే ఆ పని జరుగుతుంది అని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ కార్యాలయంలో ఈసీలు, డాక్యుమెంట్ నకళ్ళు ( సీసీలు) వ్యాల్యూషన్ సర్టిఫికెట్లు మ్యారేజ్ సర్టిఫికెట్స్, క్రయవిక్రయాలు, గిఫ్ట్ డీడ్ లు చెల్లు రసీదులు తదితర స్టాంప్స్, రిజిస్ట్రేషన్ సేవలు పొందాలంటే అనధికారకంగా డబ్బులు చెల్లించాల్సిందే లేదంటే పై స్థాయి అధికారి నుండి క్రింది స్థాయి గుమాస్తా వరకు అనేక రకాలుగా ఇబ్బందులు గురిచేస్తూ ఉంటారని బాధితులు ఆరోపిస్తున్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన వారు అప్పుల బాధ తాళలేక ఆస్తులు తాకట్టు పెట్టుకునేందుకు రిజిస్టర్ కార్యాలయానికి వస్తే సార్ వసూలు చేసే అధిక పన్నులు మరింత భారంగా ఉన్నాయని బాధితులు రోదిస్తున్నారు. రిజిస్ట్రేషన్ కొరకు ఫైల్ తయారు చేసుకుని సార్ దగ్గరకు తీసుకొని వస్తే ఆయన అనుకున్న రేటు వచ్చేవరకు ఏదో ఒక కొర్రు బిగించి ఇబ్బందులకు గురిచేసి తన అనుకున్న రేటును ఇచ్చినప్పుడే ఫైల్ ముందుకు సాగే విధంగా ఉంటుందని పలువురు దస్తావేజుఖర్లు చెవులు కొరుకుంటున్నారు.

ఈ విధంగా ఈ కార్యాలయంలో ప్రభుత్వ ఖజానా కంటే ఇన్చార్జి సబ్ రిజిస్ట్రార్ ఖజానాకే అధిక మొత్తంలో నిధులు వెళుతున్నాయని ప్రజలు బాటసంగా చర్చించుకుంటున్నారు. నందిగామ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇన్చార్జి సబ్ రిజిస్టర్ తీరుపై బాధితులు గగ్గోలు పెడుతున్న అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం వెనుక మతలబు ఏమిటి అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

నందిగామ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అధికంగా అక్రమ వసూళ్లు జరుగుతున్న అ.ని.శా అధికారులు అటువైపు కన్నెత్తు చూడకపోవటం వెనుక అంతర్యం ఏమిటా అని పలువురు ఆశ్చర్యాన్ని వ్యక్తపరుస్తున్నారు. అంతేకాక అవినీతి నిరోధక శాఖ అధికారులు కూడా అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. అ.ని.శా కార్యాలయంలో తన అనుచరులు ఉన్నట్లుగా ఈ కార్యాలయం నుండి ప్రతినెల పై అధికారులకు ముడుపులు చెల్లిస్తున్నట్లుగా ఆ అధికారి చెప్పుకోవడం కోస మెరుపు. ఈ విధంగా తన అధికారాన్ని అడ్డుపెట్టుకొని ప్రజల సొమ్మును దోచుకోవటం ఆయనకు పరిపాటిగా మారింది కనుక ఇప్పటికైనా సంబంధిత జిల్లా అధికారులు, అవినీతి నిరోధక శాఖ అధికారులు స్పందించి ఈ కార్యాలయంలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై విచారణ జరిపించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

## గుణదల మేరీమాత పుణ్యక్షేత్రం మత సామరస్యానికి ప్రతీక





(మొదటిపేజీ తరువాయి)

కృషి చేస్తానని ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు. దేశవిదేశాల్లో గుణదల మేరీ మాత ఉత్సవాల గురించి చెప్పుకునే విధంగా మరిన్నీ వసతులు, సదుపాయాలు కల్పించి ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. దక్షిణ భారత దేశంలోనే ప్రముఖ క్రైస్తవ పుణ్యక్షేత్రంగా వెలుగొందుతున్న గుణదల మేరీమాత ఉత్సవాల ముగింపు వేడుకలు బుధవారం జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ లను బిషప్ తెలగతోటి రాజారావు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పాదర్‌లకు ఎంపీ కేశినేని శివనాథ్ తృణ ధాన్యాలతో కూడిన బహుమతి అందజేశారు. అనంతరం బిషప్, పాదర్ లతో కలిసి మేరీమాత ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరికీ మేలు జరగాలని ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ ప్రతి ఏటా సంప్రదాయబద్ధంగా నిర్వహించే ఈ ఉత్సవాలలో పాల్గొని మేరీమాత ఆశీస్సులు తీసుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. విజయవాడకు గుణదల మేరీమాత ఉత్సవాలు ఎంతో ప్రతిష్టాత్మకమమంటూ. మేరీమాత ఉత్సవాల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో జిల్లా యంత్రాంగం చక్కటి ఏర్పాట్లు చేశారని అభినందించారు. దేశంలో ఎంతో పేరుగాంచిన క్రైస్తవ పుణ్యక్షేత్రాలలో ఒకటిగా ప్రసిద్ధి గాంచిన గుణదల మేరీమాత దేశవ్యాప్తంగా కోట్లాది మంది భక్తుల నీరాజనాలు అందుకుంటూ మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ అసెంబ్లీలో రాష్ట్ర బడ్జెట్ సమావేశాల్లో పాల్గొనటానికి ముందుగా మేరీమాత ఆశీస్సులు అందుకోవటం ఎంతో సంతోషంగా వుందన్నారు. మేరీమాత దివ్య ఆశీస్సులతో ఎన్డీయే కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో వున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వికార్ జనరల్ రెక్టర్ మువ్వల ప్రసాద్, రెక్టర్ గుణదల పుణ్యక్షేత్రం ఏలేటి విలియ్ జయరాజు, గుణదల చర్చ్ కౌన్సిల్ ప్రెసిడెంట్ ఎన్.విజయరాజు, టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి బొప్పన భవకుమార్, ఎన్టీఆర్ జిల్లా క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు ఊర్ల మోహన్ రావు, టిడిపి క్రిస్టియన్ నాయకులు ఇత్తడి చార్లెస్, చాట్ల రాజశేఖర్, టి.ఎన్.టి.యు.సి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరుచూరి ప్రసాద్, టి.ఎన్.ఎస్.ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాయి చరణ్, ఎన్టీఆర్ జిల్లా ఎన్.ఐ.ఆర్.డి అర్బన్ కో-ఆర్డినేటర్ వల్లభనేని నరసింహాచౌదరి,టిడిపి నాయకులు మాదిగాని గురునాథం, ఆంధ్రప్రదేశ్ ఖాదీ, గ్రామీణ పరిశ్రమల బోర్డు డైరెక్టర్ దయ్యాల శిరీష గాంధీ, గొల్లపూడి మార్కెట్ యార్డ్ డైరెక్టర్ పర్వతనేని రత్నశ్రీ, టిడిపి 2వ డివిజన్ ప్రెసిడెంట్ దాసరి గాబ్రియేల్,సెక్రటరీ సుగసాని కృష్ణప్రసాద్, టిడిపి 5వ డివిజన్ మాజీ ప్రెసిడెంట్ దేవానంద్, టిడిపి 7వ డివిజన్ అధ్యక్షుడు పటమట సతీష్ చంద్ర, ఎమ్.ఆర్.పి.ఎస్ నాయకులు మానికొండ శ్రీధర్‌లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# మహాశివరాత్రి పర్వదిన సందర్భంగా అప్రమత్తంగా ఉండండి..

(మొదటిపేజీ తరువాయి)

అప్రమత్తంగా ఉండి ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ నగరంలోని కలెక్టరేట్ మీకోసం సమావేశం మందిరంలో సంయుక్త కలెక్టర్ ఎం నవీన్, సహాయ కలెక్టర్ ఫర్హీన్ జాహిద్ లతో కలిసి తహసిల్దారులు, దేవాదాయ శాఖ అధికారులతో మహాశివరాత్రి ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. జిల్లా ఎస్పీ వీ. విద్యాసాగర్ నాయుడు, డీఎస్పీలు జూమ్ మీటింగ్ ద్వారా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలైన మోపిదేవి, పెదకల్లేపల్లి, ఎనమలకుదురు, కృత్తివెన్ను నాగేశ్వర స్వామి దేవస్థానం తదితర ప్రభుత్వ ప్రైవేటు దేవాలయాలలో భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుందన్నారు. సంబంధిత యాజమాన్యాలతోనూ దేవాదాయ శాఖ కార్యనిర్వాహక అధికారులతోనూ పోలీసు, రెవెన్యూ శాఖ సిబ్బంది సమన్వయం చేసుకొని భక్తులకు కావలసిన మంచినీరు, ఆహారము తదితర ఏర్పాట్లు సజావుగా అందేలా చూడాలన్నారు. జిల్లాలో దేవాలయాల వద్ద చిన్న ప్రదేశాలలో సామర్థ్యానికి మించి భక్తులను లోనికి ప్రవేశించకుండా తగిన నియంత్రణ ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ ప్రైవేటు అన్ని యాజమాన్యాల దేవాలయాలను సంబంధిత ఆర్డీవోలు, తహసిల్దార్లు, డిఎస్పీలు, సీఐలు ఎస్సైలు ముందుగానే ఆయా ప్రదేశాలను సందర్శించి సజావుగా పర్యవేక్షించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా కావలసిన ఏర్పాట్లు చూడాలన్నారు.ఏదైనా అనుకోని సంఘటన జరిగితే నిష్క్రమనకు ఎక్కువ దారులు ఏర్పాటు చేయాలన్నారు.దర్శనానికి ఎక్కువ సమయం పట్టే పక్షంలో వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సమయానికి ఆహారము, మంచినీరు అందించేలా చూడాలన్నారు. అంతేకాకుండా అంబులెన్స్లను, వైద్య శిబిరాలను ముందస్తుగా అందుబాటులో ఉంచుకోవాలన్నారు.విద్యుత్తు సరఫరాకు అంతరాయం లేకుండా ఏర్పాట్లు చేయడంతో పాటు అగ్నిమాపక యంత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. కోనేరు తదితర ప్రాంతాల్లో కూడా సామర్థ్యానికి మించి భక్తులు నీటిలోకి దిగకుండా నియంత్రించాలన్నారు. వాహనాల రాకపోకలకు ఎలాంటి అంతరాయము కలగకుండా రహదారి మార్గం సజావుగా పర్యవేక్షించాలన్నారు. వాహనాల పార్కింగ్కు అవసరమైన స్థలాలను ముందుగానే గుర్తించి తగిన ఏర్పాటు చేయాలన్నారు. అలాగే మండలాల్లో వివిధ రకాల ముఖ్యమైన ఉత్సవాలు, జాతరలు జరిగే తేదీలను సిద్ధంగా ఉంచుకొని ఆయా రోజుల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. జిల్లా ఎస్పీ వీ.విద్యాసాగర్ నాయుడు మాట్లాడుతూ, దేవాలయాల వద్ద భక్తులు సురక్షితంగా ఉండేందు కోసం, శాంతిభద్రతలు పరిరక్షణ కోసం గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. సంబంధిత దేవాలయాల కార్యనిర్వాహణ అధికారులు దేవాలయాల వద్ద సమకూర్చవలసిన సౌకర్యాలపై పూర్తి బాధ్యత తీసుకోవాలన్నారు. జనాల నియంత్రణకు ఒక కంట్రోల్ విభాగాన్ని ఏర్పాటు చేసి సీసీటీవీ ల ద్వారా డ్రోన్ల ద్వారా పర్యవేక్షిస్తామన్నారు. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు వారి సెల్ నెంబర్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. తొక్కిసలాట జరగకుండా దర్శనానికి వచ్చే భక్తుల కోసం అవసరమైతే క్యూ లైన్లు పెంచాల్సి ఉంటుందన్నారు. ఈ సమావేశంలో కె ఆర్ ఆర్ సి ఎస్ డి సి శ్రీదేవి దేవాదాయ శాఖ ఏసి సాంబశివరావు గుడివాడ ఆర్డిఓ జి బాలసుబ్రమణ్యం పలువురు తహసిల్దార్లు డీటీలు దేవాదాయ శాఖ కార్యనిర్వహణ అధికారులు తదితర అధికారులు పాల్గొన్నారు.

# వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సంస్థాగత కమిటీలు 10,000 పైగా పూర్తి



**జగ్గయ్యపేట, ఫిబ్రవరి 11, మేజర్ న్యూస్ :** పదివేల మందితో కమిటీ పూర్తితో పాటు డిజిటలేషన్ పూర్తయ్యాయని జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ ఇన్-ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు అన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రంలో 175 నియోజకవర్గాల్లో సంస్థాగత కమిటీ నిర్మాణలు చేపడుతున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగ్గయ్యపేట నియోజకవర్గంలో 10000 వేల మందితో సంస్థాగత కమిటీ నిర్మాణం పూర్తి చేసామని ఆయన అన్నారు. సంస్థాగత పార్టీ గ్రామ కమిటీ నిర్మాణాన్ని నియోజకవర్గంలోని గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు జగ్గయ్యపేట మండలం, పెనుగంచిప్రోలు మండలం, వత్సవాయి మండలం, నందిగామ మండలంలో ఏట్టు పట్టు గ్రామాలు, జగ్గయ్యపేట మున్సిపాలిటీ కలిపి 10,000 పై చిలుకు గ్రామ, మండల అనుబంధ విభాగాలు పూర్తయ్యాయని అన్నారు. కార్యకర్తల కష్టానికి తగిన గుర్తింపు తప్పనిసరిగా ఉంటుందని అన్నారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు అండగా నిలిచిన ప్రతి కార్యకర్తకు ప్రభుత్వం తిరిగి ఏర్పడిన వెంటనే తగిన గుర్తింపు, గౌరవం తప్పకుండా కల్పిస్తామని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్ ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు భరోసా ఇచ్చారు. పార్టీ కోసం చెమట చిందించిన ప్రతి ఒక్కరిని కంటికి రెప్పలా కాపాడుకుంటామని, కష్టపడే వారికి సముచిత స్థానం కల్పిస్తామని ఆయన స్పష్టం చేశారు. పార్టీ సంస్థాగత బలోపేతంపై దృష్టి సాధించమన్నారు. రాజకీయ మార్పు యువతతోనే సాధ్యమని పేర్కొంటూ, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో యువతకు పెద్దపీట వేస్తామని ఆయన తెలిపారు. యువతను కేవలం ఓటర్లుగా కాకుండా, భవిష్యత్తు నాయకులుగా తీర్చిదిద్ది రాజకీయంగా చైతన్యవంతులను చేస్తామని అన్నారు. రాష్ట్రంలో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభంజనాన్ని ఆపడం ఎవరితరం కాదని, రాబోయే రోజుల్లో మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి అవుతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ సంస్థాగత కమిటీ నిర్మాణంలో ఉన్న కమిటీ సభ్యులు పార్టీలో ఒక సైనికుల్లా పని చేయాలని ఆయన అన్నారు. అధికార పార్టీ ఆగడాలను దాడులను ఎప్పటికప్పుడు ఎండగట్టి ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఆయన సూచించారు. క్షేత్రస్థాయిలో పటిష్టమైన కమిటీల ఏర్పాటు ద్వారా ప్రజలకు ఎలప్పుడూ అందుబాటులో ఉండేలా పార్టీని మరింత బలోపేతం అవుతుందని స్పష్టం ఆయన చేశారు. ఈ కార్యక్రమంలో వైస్సార్సీపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## గ్రామ కమిటీల నియామకాలను వెంటనే పూర్తి చేయండి

**పామర్రు మేజర్ న్యూస్:** నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పామర్రు మండల అధ్యక్షుని ఆధ్వర్యంలో మండల నాయకులు, కార్యకర్తలతో మాజీ శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్ బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని ప్రస్తుత పరిస్థితులపై ఆరా తీసి, గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేసే విధంగా వై.యస్.జగన్మోహన్ రెడ్డి ఆదేశాలమేరకు గ్రామ పార్టీ కమిటీ, అనుబంధ విభాగాల కమిటీల నియామక ప్రక్రియ త్వరతగతిన పూర్తి చేయాలని సూచించారు. కమిటీల నియామకం పూర్తి చేయడం ద్వారా గ్రామాల్లో పార్టీ బలోపేతానికి కృషి చేసేందుకు అవకాశం కలుగుతుందన్నారు. వీలైనంత త్వరగా ఈ కమిటీలను పూర్తి చేయాలని ఆయన నాయకులకు సూచనలు అందజేశారు. ఈ సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు కాకర్ల వెంకటేశ్వరరావు ఎంపీపీ దాసరి అశోక్ కుమార్ లతోపాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పేదల ఆరోగ్య భద్రతకు చేయూత



**గొల్లపూడి మేజర్ న్యూస్ :** పేదల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం చేయూతనిస్తూ ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి వెంటనే ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు పేర్కొన్నారు. ఇటీవల అనారోగ్యానికి గురైన పలువురికి మెరుగైన వైద్యసేవల నిమిత్తం సీఎంఆర్ఎఫ్ నుంచి లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్.ఓ.సి)లు మొత్తం రూ.23,20,814లు మంజూరయ్యాయి. వీటిని విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోని శాసనసభ్యుని వారి కార్యాలయంలో లబ్దిదారుల కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు బుధవారం అందజేశారు. స్థానిక కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## జోగి రమేష్ అతని అనుచరులపై జనసేన నేత బ్రహ్మయ్య ఫైర్




**ఇబ్రహీంపట్నం మేజర్ న్యూస్ :** కొండపల్లి మున్సిపాలిటీ జనసేనపార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మైలవరం నియోజకవర్గ ఇన్చార్జి అక్కల రామ్మోహన్ రావు(గాంధీ)పై అనుచిత వ్యాఖ్యలు చేసిన జోగి రమేష్ వర్గీయులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వారిపై ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్లో జనసేనపార్టీ కొండపల్లి మున్సిపాలిటీ అధ్యక్షులు చెరుకుపల్లి సురేష్ కంప్లైంట్ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా జనసేనపార్టీ మైలవరం మండల అధ్యక్షులు శీలం బ్రహ్మయ్య విలేకరులతో మాట్లాడుతూ ఒక బీసీ కులానికి చెందిన ఒక వ్యక్తిని అతి దారుణంగా పెట్రోల్ పోసి చంపినప్పుడు కులం కూడు పడుతుందా అని మాట్లాడిన జోగి రమేష్ ఈరోజు నారా లోకేష్ని, చంద్రబాబుని, పవన్ కళ్యాణ్ని మా నాయకుడు అక్కడ గాంధీని నోటికి వచ్చినట్లు మాట్లాడటం చాలా బాధాకరమన్నారు ఇది ఇలనే కొనసాగితే ఈ జనసైనికులు చూస్తూ ఊరుకోరని మరొకసారి బుద్ధి చెప్పాల్సి ఉంటుందని ఆయన తెలిపారు అంబటి రాంబాబు ఒక రాష్ట్రానికి నాలుగు సార్లు ముఖ్యమంత్రి అయిన చంద్రబాబు నాయుడు ని అనేక అసభ్య పదజాలాలతో దూషిస్తున్నారని కూటమి నాయకులు చూస్తూ ఊరుకోరని తగిన గుణపాఠం చెబుతారని ఆయన హెచ్చరించార ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు ఎర్రంశెట్టి నాని,రాగాల నాని, గొల్లపూడి మార్కెట్ యార్డు డైరెక్టర్ చెరుకుమల్లి రాధిక,వీరమహిళలు రమాదేవి,అనిత,జనసేన పార్టీ నాయకులు చాపలమడుగు కాంతారావు, ఎర్రబోలు నరసింహారావు, మెరుగునాగేశ్వర రావు(నాని), పాములపాటి సుందర్ రామిరెడ్డి, ఆకుతోట ఈశ్వర్,తోట క్రాంతి,కొండ, నాయుడు శ్రీనివాస్,మారెళ్ళ భాస్కర్,కొమ్మూరు వెంకటస్వామి, లేళ్ల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ మహిళల, బాలికల విజ్ఞాన దినోత్సవం



**పెనుగంచిప్రోలు, ఫిబ్రవరి 11, మేజర్ న్యూస్ :** మండలం పరిధిలోని బాలికల ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మహిళలు, బాలికల విజ్ఞాన దినోత్సవంను ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఆస్పిరషనల్ బ్లాక్స్ ప్రోగ్రామ్స్లో భాగమైన సంపూర్ణత అభియాన్ 2.0 కింద, గౌరవ జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం నిర్వహించారు. ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం బాలికలను విజ్ఞానం,సాంకేతికత, ఇంజినీరింగ్, గణితం స్టెమ్ రంగాలలో విద్య, వృత్తి అవకాశాల వైపు ప్రోత్సహించడం, విజ్ఞాన రంగాలలో లింగ సమానత్వంపై అవగాహన కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ బాలికలు విజ్ఞాన, సాంకేతిక రంగాలలో ముందుకు రావాల్సిన అవసరాన్ని వివరించారు. మహిళా శాస్త్రవేత్తల విజయాలను ఉదాహరణగా పేర్కొంటూ, బాలికలు ధైర్యంగా స్టెమ్ రంగాలను ఎంచుకోవాలని ప్రోత్సహించారు. అలాగే ప్రభుత్వ పథకాలు, అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విజ్ఞాన విద్య ప్రాముఖ్యతపై అవగాహన సదస్సులు, విద్యార్థినులతో పరస్పర చర్చలు నిర్వహించబడినాయి. కిశోర బాలికలకు మార్గనిర్దేశం చేయడంలో అంగన్వాడీ కార్యకర్తల పాత్ర ఎంతో కీలకమని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా బాలికలలో స్టెమ్ రంగాలపై అవగాహన పెరగడంతో పాటు, విజ్ఞాన విద్యను అభ్యసించేందుకు ఆత్మవిశ్వాసం, ప్రేరణ పెరిగిందని నిర్వాహకులు తెలిపారు. దేశాభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో కీలకమని, విజ్ఞాన రంగంలో బాలికల భాగస్వామ్యం భవిష్యత్తుకు మార్గదర్శకమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏబిపి కోఆర్డినేటర్ మోహన్ సందీప్, అంగన్వాడీ సూపర్వైజర్ రజని, అంగన్వాడీ కార్యకర్తలు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు,ఉన్నత పాఠశాలల విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.



## రోడ్డు ప్రమాదాలకు అడ్డుకట్టే లక్ష్యం

### ఉదయం 6గంటల నుండే విస్తృత వాహనాల తనిఖీలు

**ఇబ్రహీంపట్నం మేజర్ న్యూస్ :** పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్ బాబు ఆదేశాల మేరకు, ట్రాఫిక్ డిసిపి షరీనా బేగం ఐపీఎస్ పర్యవేక్షణలో రోడ్డు భద్రతను మరింత పటిష్టం చేయడం, ప్రమాదాల వల్ల జరుగుతున్న ప్రాణనష్టాన్ని తగ్గించడం లక్ష్యంగా ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రత్యేక వాహనాల తనిఖీలు నిర్వహిస్తూ, ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ వినియోగంపై విస్తృత అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు ప్రధాన రహదారులు, కూడళ్లు, జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో వాహనాలను తనిఖీ చేసి, ట్రాఫిక్ నిబంధనల ప్రాముఖ్యతను వివరించారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ధరించడం ద్వారా ప్రాణాలను ఎలా కాపాడుకోవచ్చో, తలకు తీవ్ర గాయాలు కాకుండా ఎలా రక్షణ లభిస్తుందో అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించకుండా వాహనం నడిపితే జరిగే ప్రమాదాలు, చట్టపరమైన చర్యల గురించి కూడా స్పష్టంగా తెలియజేశారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై మోటారు వాహన చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల ప్రాణాల రక్షణే ప్రధాన లక్ష్యంగా, ఇటువంటి తనిఖీలు, అవగాహన కార్యక్రమాలు భవిష్యత్తులో కూడా నిరంతరం కొనసాగుతాయని జిల్లా పోలీసులు తెలిపారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నియమాలను పాటించి, హెల్మెట్ను అలవాటుగా మార్చుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## పవర్ లిఫ్టింగ్లో ఎల్.బి.ఆర్.సి.ఇ విద్యార్థుల ప్రతిభ



**మైలవరం, మేజర్ న్యూస్ :** ఈ నెల 8న అమరావతి పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో ఉమ్మడి కృష్ణా, ఎన్.టి.ఆర్ జిల్లా పవర్ లిఫ్టింగ్ పోటీలు గుడివాడ, ఎన్.టి.ఆర్ స్టేడియంలో నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ కే అప్పారావు తెలిపారు. ఇందులో భాగంగా యల్.బి.ఆర్.సి. ఈ, ఈ. సి.ఈ విద్యార్థి వెంకట పూర్ణ చంద్ర 50 కేజీల విభాగాలలో 330 కేజీల బరువు ఎత్తి గోల్డ్ మెడల్, విద్యార్థి సాయి తేజ్ రెడ్డి 59 కేజీల విభాగాలలో 240 కేజీల బరువు ఎత్తి కాంస్య పతకం సాధించినట్లు తెలిపారు. బి.సాయి ప్రసాద్ నాయిక్ 84 కేజీల విభాగాలలో 300 కేజీల బరువు ఎత్తి రజత పతకం సాధించారు. వెంకట పూర్ణ చంద్ర ఈ నెల 13 వ తేదీన కర్నూల్ లో అమరావతి పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ మూడవ ఏపీ స్టేట్ ఆధ్వర్యంలో నిర్వహించే పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా మెడల్స్ సాధించిన విద్యార్థుల్నీ, వాళ్ళకి ట్రైనింగ్ ఇచ్చిన జిమ్ కోచ్ శ్రీ.ఎస్.నటరాజ్ ను, ఫిసికల్ ఎడ్యుకేషన్ విభాగాధిపతి డా.రాజ్ కుమార్ లను కళాశాల ప్రెసిడెంట్ శ్రీ.జి.శ్రీనివాస రెడ్డి,ప్రిన్సిపాల్ డా.కె.అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు అభినందించారు.

## మినుము పంటలో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి



**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** మినుము పంట 50-60 రోజుల దశలో ఉన్నందున రైతులు తగిన సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని చల్లపల్లి మండల వ్యవసాయశాఖ అధికారి కె.మురళీకృష్ణ సూచించారు. బుధవారం మండల పరిధిలోని నిమ్మగడ్డ, ఆముదార్లంక గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మినుము పంటను పరిశీలించి రైతులతో మాట్లాడి తగు సూచనలు చేశారు. మారుకామొచ్చల పురుగు నివారణకు నోవల్యూరాన్ 200 మిల్లీలీటర్లు లేదా క్లోరాంత్రనిల్ల్ 60 మిల్లీలీటర్లను 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. బూడిద తెగులు, తుప్పు తెగులు ఆశించే అవకాశం ఉన్నందున తెగుళ్ళ ఉధృతి గమనించిన వెంటనే తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ఈ క్రాప్ బుకింగ్ చేయించుకోని రైతులు వెంటనే సంబంధిత వీఏఏ, వీహెచ్ఎ, ఏఈవోను సంప్రదించి వివరాలు తెలియచేయాలని కోరారు. కార్యక్రమంలో వీఏఏలు వి.నాగబాబు, ఎ.సౌమ్య, రైతులు పాల్గొన్నారు.



## ఆహార నియమాల వల్ల క్యాన్సర్ దూరం

### కెయూ ఉపకులపతి ఆచార్య కె రాంజీ

### ఎన్ ఎస్ ఎస్ ఆధ్వర్యములో క్యాన్సర్ అవగాహన సదస్సు

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** రోజు వారి ఆహారపు అలవాట్లు మార్చుకోవడం ద్వారా క్యాన్సర్ రాకుండా చూసుకోవడం సాధ్యమవుతుందని కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె రాంజీ అన్నారు. మణిపాల్ ఆస్పత్రికి సౌజన్యంతో కృష్ణా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ 1,2,3 ఎన్ఎస్ఎస్ యూనిట్‌ల ఆధ్వర్యములో బుధవారం క్యాన్సర్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జంక్ ఫుడ్స్, ఫాస్ట్ ఫుడ్స్‌తో పాటు ఆర్డర్‌లపై కొనుగోలు చేస్తున్న ఆహార పదార్థాల తయారీలో క్యాన్సర్ కారక పదార్థాలు ఎక్కువగా వినియోగించడం జరుగుతుందన్నారు. ఇటువంటి ఆహారపు అలవాట్లు మార్చుకోవడం ఎంతైనా అవసరమన్నారు. మహిళలు ముఖానికి పసుపు రాసుకునే అలవాటు మన పూర్వీకులు నేర్పించడానికి ప్రధాన కారణం క్యాన్సర్ రాకుండా పసుపు నిరోధిస్తుందని అన్నారు. రెక్టర్ ఆచార్య ఎంవి బసవేశ్వరరావు మాట్లాడుతూ తొలి దశలో క్యాన్సర్ ను గుర్తిస్తే నివారణ సులభం అన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య ఎన్ ఉష మాట్లాడుతూ క్యాన్సర్ రాకుండా ముందుస్తు జాగ్రత్తలు తీసుకోవడం ఉత్తమం అని చెప్పారు. ఎన్ ఎస్ ఎస్ విభాగం సమన్వయకర్త డాక్టర్ ఎం శ్రావణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మణిపాల్ ఆసుపత్రి క్యాన్సర్ వైద్యులు డా. భవాని, డా. శ్రీదివ్య లు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా క్యాన్సర్ పై అవగాహన కల్పించారు. ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రామ్ అధికారిణి డా. సల్మా, డా. శేషా రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

## నులి పురుగుల నివారణ గోడ పత్రిక ఆవిష్కరణ



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ఈ నెల 17వ తేదీన జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా జిల్లాలోని 19 ఏళ్లలోపు పిల్లలందరికీ ఆల్బెండాజోల్ మాత్రలు వేసేలా చూడాలని మచిలీపట్నం జిల్లా కలెక్టర్ ఆఫీసులో నిర్వహించిన, జిల్లాలోని అన్ని శాఖల సమన్వయ కమిటీ సమావేశంలో కలెక్టర్ డి కె బాలాజీ తెలియజేసారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి సంబందించిన గోడ పత్రికలను ఆవిష్కరించిన అనంతరం, సంబంధిత శాఖల వారు ఈ కార్యక్రమానికి సమన్వయంతో ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. డిఎంహెచ్ఓ డాక్టర్ పి యుగంధర్ మాట్లాడుతూ, బాలబాలికల జీర్ణ వ్యవస్థలో చేరిన నులి పురుగుల వలన రక్త హీనత ఏర్పడుతుందని, వీటిని అరికట్టేందుకు ప్రభుత్వం ప్రతి సంవత్సరం రెండుసార్లు నులి పురుగుల నివారణ కార్యక్రమాన్ని అంగన్వాడీ, అన్ని యాజమాన్యాల పాఠశాలలు, జూనియర్, డిగ్రీ, నర్సింగ్, సాంకేతిక కళాశాలలో నిర్వహిస్తోందని, ఈ నెల 17న మాత్రలు తీసుకొని వారికి మరల 24వ తేదీన మాప్ అప్ డే నిర్వహించి మాత్రలు అందజేస్తారని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో కృష్ణాజిల్లా జాయింట్ కలెక్టర్ నవీన్ ఆర్బీఎస్కే కార్యక్రమ నిర్వహణాధికారి డా. హిమబిందు, ఆర్బీఎస్కే సిబ్బంది పాల్గొన్నారు.

## దేవాలయాల అభివృద్ధికి కూటమి కట్టుబడి ఉంది



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** దేవాలయాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, స్థానిక కొజ్జిల్లి పేట నాగేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ లంకి శెట్టి నీరజ అన్నారు. ఈనెల 15వ తేదీన మహాశివరాత్రి సందర్భంగా నాగేశ్వర స్వామి వారి దేవస్థానం ఆహ్వాన పత్రికలను ఆలయ చైర్మన్, ఈవో మాధవిలత మాజీ మున్సిపల్ చైర్మన్ బాబా ప్రసాద్ తదితరులతో కలిసి ఆవిష్కరించారు. నాగేశ్వర స్వామి దేవస్థానం ఆలయ చైర్మన్ లంకి శెట్టి నీరజ మాట్లాడుతూ స్థానిక కొజ్జిల్లి పేట లోని నాగేశ్వర స్వామి దేవస్థానంలో ఈనెల 15వ తేదీన మహాశివరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించడం జరుగుతోందన్నారు. దేవాలయ ప్రాంగణంలో మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. మహాశివరాత్రి ఉత్సవాన్ని విజయవంతం చేయవలసిందిగా కోరారు. బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పీవీ ఫణి కుమార్, కార్పొరేటర్ దింటకుర్తి సుధాకర్, ఆలయ కమిటీ సభ్యులు త్రివేణి, మౌనిక, శివయ్య, సూదాబత్తుల రంగదాసులు పాల్గొన్నారు.

### 13న ఎస్ ఎస్ ఆర్ డిగ్రీ కళాశాలలో..

# కంపెనీ స్పెసిఫిక్ రిక్రూట్మెంట్ డ్రైవ్

### నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

### కృష్ణాజిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీ



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో, జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలను కల్పించుటకు గాను ఈ నెల 13న శుక్రవారం ఉదయం 9 గంటలకు మచిలీపట్నం లోని ఎస్-ఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో కంపెనీ స్పెసిఫిక్ రిక్రూట్మెంట్ డ్రైవ్” నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీ, తెలియజేసారు. ఈ డ్రైవ్‌లో ప్రముఖ ఆభరణాల సంస్థ జోయాలుక్కాస్ ఇండియా లిమిటెడ్‌లో షోరూమ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేయనున్నారు. ఇంటర్, ఐటీఐ, డిప్లొమా లేదా ఏదైనా డిగ్రీ అర్హత కలిగిన 18 నుండి 30 సంవత్సరాల మధ్య వయస్సు గల యువత ఈ డ్రైవ్‌లో పాల్గొనవచ్చునని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.నరేష్ కుమార్ తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు సుమారు రూ.23,000లు వేతనంతో పాటు ఆకర్షణీయమైన ప్రోత్సాహకాలు, ఈపిఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్ వంటి సౌకర్యాలు కల్పించబడతాయి. అదనంగా ఉచిత భోజనం, వసతి సౌకర్యాలు కూడా అందించబడతాయి. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 200 ఖాళీలు భర్తీ చేయనున్నారు. అభ్యర్థులు బయోడేటా, విద్యార్హత సర్టిఫికెట్ల జిరాక్స్ ప్రతులు, ఆధార్ కార్డు, పాన్ కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు తీసుకుని హాజరు కావాలని కోరడమైనది. అలాగే అభ్యర్థులు ముందస్తుగా naipunyam.ap.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవలసిందిగా సూచించారు. స్పాట్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలనుకునే అభ్యర్థులు తప్పనిసరిగా ఆధార్‌కు లింక్ అయిన మొబైల్ నంబర్‌ను వెంట తీసుకురావలసిందిగా సూచించారు. మరిన్ని వివరాలకు 9966489796 నంబర్ను సంప్రదించాలని తెలిపారు.



## విలేజ్ హెల్త్ క్లినిక్ నిర్మాణానికి 6సెంట్ల భూమి విరాళం

**పమిడిముక్కల మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని వీరంకి గ్రామంలో విలేజ్ హెల్త్ క్లినిక్ సెంటర్ ఏర్పాటు చేసేందుకు అవసరమైన ఆరు సెంట్ల భూమిని దాత అందజేశారు. గ్రామానికి చెందిన మహమ్మద్ వాహేదుల్ల కుమారుడు అబ్దుల్ కరీం పర్వేజ్ జిల్లా పరిషత్ రోడ్డు పక్కన తనకు ఉన్న భూమిలో నుండి 6 సెంట్ల భూమిని గ్రామ పంచాయతీ పేరున రిజిస్ట్రేషన్ చేయించి సర్పంచ్, గ్రామ ప్రజలు, సచివాలయ సిబ్బంది సమక్షంలో పంచాయతీ కార్యదర్శి కనుమూరి సౌజన్యకు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా దాత అబ్దుల్ కరీం పర్వేజ్‌ను గ్రామస్తులు, సచివాలయ సిబ్బంది అభినందించి కృతజ్ఞతలు తెలిపారు.

# పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలి





**పెదపారుపూడి మేజర్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీ బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. మండల కేంద్రమైన పెదపారుపూడిలో ఏర్పాటు చేసిన కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఆయన జిల్లా పార్టీ అధ్యక్షులు వీరంకి వెంకట గురుమూర్తితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇకపై వారంలో ఒకరోజు ఒక గ్రామంలో పర్యటించి ఆ గ్రామంలో సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు విజయ సాధించేందుకు ఇప్పటినుండి ప్రతి ఒక్కరు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పనిచేసినప్పుడే విజయాలను అందుకోగలుగుతామన్నారు. తెలుగుదేశం పార్టీ క్రమశిక్షణకు మారుపేరని ఎవరైనా పార్టీ నియమ, నిబంధనలను ఉల్లంఘించినట్లయితే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాలలో అభివృద్ధి ఒకవైపు కార్యకర్తల సంక్షేమం మరోవైపు ఉండేలా చూసుకుంటానని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు వీరంకి వెంకట గురుమూర్తి, నియోజకవర్గ పార్టీ పరిశీలకులు కోట వీరబాబు, మండల పార్టీ అధ్యక్షులు చలసాని రమేష్ చౌదరి (చంటి), ప్రధాన కార్యదర్శి మసిముక్కు రాంబాబు, పామర్రు వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చిలకా ఆంజనేయులు, గ్రామ సర్పంచ్ చప్పిడి సమీర, పిఏసిఎస్ అధ్యక్షులు అమర్ బాబు, పార్టీ నాయకులు సూరపనేని వెంకట సత్యనారాయణ, గౌరిపర్తి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం తెలుగుదేశం పార్టీ గ్రామ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం కార్యక్రమం జరిగింది. గ్రామ కమిటీ అధ్యక్షులుగా బొమ్మనబోయిన వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా రవి, ఉపాధ్యక్షునిగా యేసుపాదం, సభ్యులుగా పుణ్యేశ్వరరావు, సుదర్శన జోజిబాబు, అంగిరేకుల రామారావు, టి.మంగమ్మ, జి.కుమారి, సురేఖ, ప్రభాకర్‌లు నియమితులు కాగా వారితో ఎమ్మెల్యే కుమార్ రాజా, జిల్లా పార్టీ అధ్యక్షులు వీరంకి గురుమూర్తిలు ప్రమాణ స్వీకారం చేయించారు.

## వితంతువులకు పింఛన్ మంజూరు చేసి వారి కష్టాలు తీర్చండి



**పమిడిముక్కల మేజర్ న్యూస్ :** రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం భర్తను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న వితంతువుల కష్టాలు తీర్చాలని రెడ్డిక కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కంభపు రాంబాబు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. భర్తను కోల్పోయి పిల్లల భారం మోస్తూ జీవనం సాగిస్తున్న అనేకమంది వితంతు మహిళలకు పింఛన్ మంజూరు కాకపోవడం పట్ల ప్రజల నుండి తీవ్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయని ఆయన పేర్కొన్నారు. వితంతువుల కన్నీళ్లపై పాలన చేయడం సరికాదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మండల పరిధిలోని మంటాడలో ఆయన మాట్లాడుతూ భర్త మరణంతోనే ఒక మహిళ జీవితం పూర్తిగా తలకిందులవుతుందని, అటువంటి పరిస్థితిలో ప్రభుత్వ పింఛన్ ఆమెకు కనీస జీవనాధారమన్నారు. కానీ ప్రస్తుతం పిల్లల భారం ఉన్న అర్హులైన వితంతు మహిళలకు కూడా పింఛన్ మంజూరు కాకపోవడం తీవ్ర బాధాకరమని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాలలో వితంతు మహిళలు చిన్న పిల్లలతో జీవన పోరాటం చేస్తూ, పింఛన్ కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఎలాంటి ఫలితం లేకుండా పోతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. “ఇది ఒక ఫైల్‌లో తీసుకున్న నిర్ణయం కావచ్చు. కానీ దీని ప్రభావం ఒక కుటుంబం ఆకలితో నిద్రపోవడంలో కనిపిస్తోంది” అని పేర్కొంటూ ఆయన తీవ్ర ఆవేదనను వ్యక్తం చేశారు. పిల్లల భారం మోస్తూ శారీరకంగా, మానసికంగా బలహీనంగా ఉన్న మహిళలకు పింఛన్ ఇవ్వడం ప్రభుత్వ దయ కాదని, అది వారి హక్కు అని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ విధానాల వల్ల బలహీన వర్గాలపై భారం పెరుగుతోందని, ఈ విధానం మానవత్వానికి విరుద్ధమని విమర్శించారు. ఈ అంశంపై తక్షణమే ప్రభుత్వం పునఃసమీక్ష చేపట్టి, అర్హులైన వితంతు మహిళలందరికీ పింఛన్ మంజూరు చేయాలని, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కంభపు రాంబాబు డిమాండ్ చేశారు.

## సిసి రోడ్ పనులు ప్రారంభం



**పమిడిముక్కల మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని వీరంకి గ్రామంలో మండల పరిషత్ నిధులతో పలు సిసి రోడ్ల పనులను ప్రారంభించారు. ఎంపిపి కాసాని వేద సుప్రజ ఆధ్వర్యంలో నిధులను ఈ రోడ్ల నిర్మాణానికి అందజేశారు. బుధవారం సిసి రోడ్డు నిర్మాణ పనులకు గ్రామ సర్పంచ్ నాగేశ్వరమ్మ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రామకృష్ణ, కాంట్రాక్టర్ సాంబశివరావు, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

# దేశాన్ని ప్రేమించే వారైతే డ్రగ్స్‌కు దూరంగా ఉండండి





**మైలవరం, మేజర్ న్యూస్ :** దేశాన్ని ప్రేమించే వారైతే డ్రగ్స్, మత్తుకు దూరంగా ఉండాలని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు పిలుపునిచ్చారు. మైలవరం పట్టణంలో డ్రగ్స్ పై దండయాత్ర కార్యక్రమంలో విజయవాడ సీపీ ఎస్.వి రాజశేఖరబాబు, ఐపీఎస్, పోలీసు అధికారులతో పాటు ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు బుధవారం పాల్గొన్నారు. విద్యార్థులు, ప్రజలు డ్రగ్స్‌కు వ్యతిరేకంగా గళమెత్తారు. ప్రతిజ్ఞ చేశారు. సైకిల్‌ను తొక్కి ర్యాలీలో పాల్గొన్నారు. 'డ్రగ్స్ వద్దు బ్రో సైకిల్ తొక్కు బ్రోసిగరెట్టు– రోగానికి మొదటి మెట్టు గుట్కా– నరకానికి దగ్గరి దారిగంజాయిశ్మశానంలో చోటు ఖరారు డ్రగ్స్– ఆ మూడింటికీ మించి' అంటూ నినదించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు మాట్లాడుతూ "ప్రతి విద్యార్థి, యువకుడు తన కుటుంబానికి, ఈ దేశానికి ఉపయోగపడాలన్నది కూటమి ప్రభుత్వ ఆకాంక్ష అన్నారు. గంజాయి, డ్రగ్స్ బారిన పడితే ఏదో ఒకరోజు పట్టుబడక తప్పదు. ఎన్‌డీపీఎస్ యాక్టు కింద అరెస్టయితే వారి జీవితంపై పిడుగు పడ్డట్లే..కనీసం పదేళ్ల జైలు శిక్ష పడుతుంది. జీవితంలో కీలక సమయం కోల్పోతారు అన్నారు. డ్రగ్స్, గంజాయి, ఇతర మాదకద్రవ్యాలు యువత, విద్యార్థుల జీవితాలను చిత్తు చేస్తున్నాయి అన్నారు. ఎన్నో దుష్పరిణామాలకు కారణమవుతున్నాయి అని ప్రజల భాగస్వామ్యంతో రాష్ట్రంలో డ్రగ్స్, గంజాయి వినియోగం లేకుండా చేయడమే తమ ధ్యేయమని స్పష్టం చేశారు. డ్రగ్స్ తీసుకుంటే చేజేతులా జీవితాన్ని నాశనం చేసుకున్నట్లే. మీరు తీసుకునే డ్రగ్స్ మీకు, మీ కుటుంబానికే కాదు సమాజానికి, దేశానికీ నష్టమే. డ్రగ్స్‌కు దూరంగా..లక్ష్య సాధనకు దగ్గరగా ఉండాలన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఏపీ గంజాయి ఉత్పత్తి కేంద్రంగా, డ్రగ్స్ దిగుమతికి చిరునామాగా మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గంజాయి సాగు గణనీయంగా తగ్గిందన్నారు. స్నేహితులు, తెలిసిన వారు ఒత్తిడి చేశారనో, ఆసక్తితోనో ఒకసారి మత్తుకు అలవాటు పడితే శారీరకంగా, మానసికంగానే కాదు మొత్తం జీవితాన్నే కోల్పోతారని, తల్లిదండ్రులు కూడా పిల్లల్ని నిరంతరం గమనిస్తూ ఉండాలన్నారు. వారి ప్రవర్తనలో తేడా కనిపిస్తే తల్లితండ్రులు వెంటనే అప్రమత్తం కావాలి. తక్షణమే వారికి కౌన్సిలింగ్ ఇచ్చి దురలవాట్లను మాన్పించాలి అని సూచించారు. ఈ కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ), ఎన్డీఏ కూటమి నేతలు, తదితరులు పాల్గొన్నారు.

## పెదపారుపూడి బాలుర హాస్టల్‌లో ట్రాఫిక్, మాదకద్రవ్యలపై అవగాహన సదస్సు



**పెదపారుపూడి మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన పెదపారుపూడి లోని బాలుర వసతి గృహంలో విద్యార్థులకు స్థానిక ఎస్సై ఆర్.శ్రీధర్ ట్రాఫిక్, మాదకద్రవ్య నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. 50 మందికు పైగా విద్యార్థులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ నియమాలు, రోడ్డు భద్రత, మాదకద్రవ్యాల వినియోగం వల్ల జరిగే నష్టాలను ఆయన వివరించారు. విద్యార్థి వయసులోనే ఒక్క లక్ష్యం పెట్టుకుని విద్యను అభ్యసించాలని సూచించారు. తద్వారా జీవితంలో ఉన్నత స్థితికి చేరుకోగలుగుతారని పేర్కొన్నారు. ట్రాఫిక్ నియమాలు పాటించి, మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటే భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందన్నారు. ఈ విషయాలను అవగాహన చేసుకోవడంతో పాటు ఇంటి చుట్టుపక్కల ఉండే వారికి, కుటుంబ సభ్యులకు కూడా తెలియపరచాల్సిన అవసరం ఉందని విద్యార్థులకు ఎస్ఐ శ్రీధర్ సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పాంప్లెట్లు, ట్రాఫిక్ సైన్‌లను అందజేశారు. హాస్టల్ అధికారులు, స్థానికులు ఈ కార్యక్రమాన్ని స్వాగతించి, ఇలాంటి అవగాహనా కార్యక్రమాలు యువతలో బాధ్యతలను పెంపొందించి వారి అభివృద్ధికి దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో స్థానిక ఏఎస్ఐ, వసతి గృహ సంరక్షణ అధికారి వెంకటేశ్వరరావు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతి



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** జి.కొండూరులోని ఆక్స్ఫర్డ్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్లో పేదరిక నిర్మూలన పోరాటంలో భాగంగ అంత్యోదయ నినాద రూపకర్త ఏకాత్మ మానవతా సిద్ధాంత రూప శిల్పి జనసంఘ్ వ్యవస్థాపకులు భారతీయ జనతాపార్టీ మూల సిద్ధాంతాలను ప్రవచించిన ఘనుడు స్వర్గీయ పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ 58 వ వర్ధంతి జి.కొండూరు ఆక్సఫర్డ్ హైస్కూల్ ప్రాంగణం లో ఘనంగా జరిగింది యం.టి.ఆర్. జిల్లా కిసాన్ మోర్చ అధ్యక్షులు కొల్లి నాగేశ్వరరావు ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో బి.జె.పి.మండల సీనియర్ నాయకులు సర్వశ్రీ సుబ్బారావు వెంకటేశ్వరరావు జి.శ్రీనివాసరావు, వెంకటరెడ్డి తుపాకుల శ్రీనివాస రావు ఏడుకొండలు తదితరులు పాల్గొని పుష్పాలతో పూలమాలలతో ఘనంగ నివాళులు అర్పించారు..

## రైతు బజార్ ఆరోపణలపై విచారణ

**ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు**



**గన్నవరం, ఫిబ్రవరి 11, మేజర్ న్యూస్ :** గన్నవరం రైతు బజార్‌లో అవినీతి జరుగుతుందంటూ వచ్చిన ఆరోపణలపై తక్షణమే విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ప్రభుత్వ విప్,గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆదేశించారు. గన్నవరం రైతు బజార్ లో దుకాణాల కేటాయింపులో అవినీతికి పాల్పడుతున్నట్లు, టమాట, దుంపల విక్రయాలు ఓ వ్యక్తి కనుసన్నల్లో జరుగుతున్నట్లు కొన్ని చానళ్లలో కథనం ప్రసారమైంది. సదరు ఛానల్ లో వచ్చిన కథనాలకు స్పందించిన ఎమ్మెల్యే యార్లగడ్డ రైతు బజార్ లో జరుగుతున్న కార్యకలాపాలపై ఆరా తీశారు. దుంపల విక్రయాల్లో అక్రమాలు జరుగుతున్నాయా లేదా అని అధికారులు, రైతులను అడిగి తెలుసుకున్నారు. సదరు ఛానల్లో వచ్చిన ఆరోపణలపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి నిజాలను నిగ్గు తేల్చాలని, అక్రమాలున్నట్లు తేలితే బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని కృష్ణాజిల్లా మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులను ఆదేశించారు. రైతులు, వినియోగదారుల శ్రేయస్సు కోసం ఏర్పాటుచేసిన రైతు బజార్లలో అక్రమాలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. గన్నవరం నియోజకవర్గంలో అవినీతి, అక్రమాలకు చోటు లేదని, అక్రమాలను ఎట్టి పరిస్థితులను సహించేది లేదని యార్లగడ్డ హెచ్చరించారు. గన్నవరం రైతు బజార్ నిర్వహణలో ఏవైనా లోటుపాట్లు ఉంటే పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేసి పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

## శ్రీ తిరుపతమ్మ దేవస్థాన హుండీ ఆదాయం 78 లక్షలు



**పెనుగంచిప్రోలు, ఫిబ్రవరి 11, మేజర్ న్యూస్ :** మండల కేంద్రంలో వేంచేసి ఉన్న శ్రీ గోపయ్య సమేత శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం నందు బుధవారం హుండీ లెక్కింపు జరిగిందని ఆలయ సహాయ కమిషనర్ మహేశ్వర రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఈ విధంగా వివరాలు వివరించారు. 71 రోజులకు గాను శ్రీ తిరుపతమ్మ అమ్మవారి సాధారణ ఖాతా ద్వారా 78,12,667/- రాగా మిశ్రమ బంగారం 50 గ్రాములు,మిశ్రమ వెండి 220 గ్రాములు వచ్చింది అని తెలిపారు. విదేశీ కరెన్సీ యు ఎస్ ఏ12 డాలర్స్,సౌదీ రియల్స్ 10,మలేషియా రింగ్గిట్స్1,ఆస్ట్రేలియా డాలర్స్ 20 రావడం జరిగిందని దేవస్థాన కార్యనిర్వహణాధికారి ప్రకటన ద్వారా తెలిపారు. ఈ హుండీ లెక్కింపులో దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారి సురేష్, ఈఈ రమ,గ్రామ పెద్దలు,దేవస్థాన సిబ్బంది, సేవా సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పుట్రేలలో ఎల్ పిజీ గ్యాస్ కనెక్షన్లు



**విస్సన్నపేట మేజర్ న్యూస్ :** విసన్నపేట మండలం పుట్రేల గ్రామంలో ప్రధాన మంత్రి ఉజ్వలా యోజన క్రింద ఎల్ పిజీ గ్యాస్ కనెక్షన్ లేని లబ్ధిదారులకీ పుట్రేల గ్రామ తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు అరిగే శ్రీనువాసరావు, నాయకులు అందజేస్తున్నారు.

## విద్యార్థులకు ఉచితంగా కళ్ళజోళ్ళు పంపిణీ



**పమిడిముక్కల మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని ఐనపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బుధవారం ఉచితంగా కళ్ళజోళ్ళు పంపిణీ చేశారు. వీరంకులాకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఆధ్వర్యంలో పాఠశాలలో చదువుతున్న 143 మంది విద్యార్థులకు ఇటీవల కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య సమస్యలు ఉన్న విద్యార్థులను గుర్తించి వారందరికీ ఉచితంగా కంటి అద్దాలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు తమ్మన వేణుగోపాలరావు చేతులమీదుగా పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులందరికీ కుష్టు వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కుష్టు వ్యాధి రాకుండా ఉండటానికి తీసుకోవలసిన ముందుజాగ్రత్త చర్యలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వీరంకిలాకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ దేవరపల్లి ఆశాలత, హెల్త్ సూపర్వైజర్ కుంటా కృష్ణమోహనరావు, మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్లు సిహెచ్. విద్యాసాగర్, దిమ్మెట శివకుమారి, ఆశావర్కర్ కె.సంధ్యారాణి తదితరులు పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## గోపాల్ కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే పరామర్శ





**పమిడిముక్కల మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని చోరగుడి గ్రామంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కందిమళ్ళ సుబ్రహ్మణ్యేశ్వరరావు సోదరుడు విజయదుర్గ గోపాల్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మరణం చెందగా ఆ కుటుంబ సభ్యులను పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా పరామర్శించారు. రోడ్డు ప్రమాదం జరిగిన పరిస్థితిని అనంతరం జరిగిన పరిణామాలను ఆయన కుటుంబ సభ్యుల నుండి అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రమాదంలో గోపాల్ బ్రెయిన్ డెడ్ కావడంతో అవయవాలను దానం చేసేందుకు ముందుకు వచ్చిన సుబ్రహ్మణ్యేశ్వరరావు – గ్రామ సర్పంచ్ పూర్ణకుమారి దంపతులను, అలాగే ఇతర కుటుంబ సభ్యులను ఆయన అభినందించారు. విజయ దుర్గ గోపాల్ మరణించి కూడా తన అవయవాలను అందించడం ద్వారా పలువురికి జీవితాన్ని ప్రసాదించాడని ఎమ్మెల్యే కుమార్ రాజా కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు కృష్ణాపురం డిస్ట్రిబ్యూటర్ కమిటీ చైర్మన్ నాదెళ్ళ సుబ్రహ్మణ్యం, పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పది విద్యార్థులకు ఉచిత లెక్కలు స్టడీ మెటీరియల్ పంపిణి



**పమిడిముక్కల మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని ఐన పూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రస్తుతం పదవ తరగతి చదువుతున్న 32మంది విద్యార్థులకు దాత తాడి గడప జడ్పీ హైస్కూల్ గణిత ఉపాధ్యాయులు ఉండి రమేష్ ఉచితంగా లెక్కలు ముఖ్యమైన స్టడీ మెటీరియల్ ను అందజేశారు. ఈ స్టడీ మెటీరియల్ ను ఐనపూరు గ్రామ వాస్తవ్యులు అన్నవరపు శివకృష్ణ ద్వారా ప్రధానోపాధ్యాయులు తమ్మన వేణుగోపాలరావుకు అందజేయగా ఆయన బుధవారం విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా దాత ఉండి రమేష్ మాట్లాడుతూ ఈ మెటీరియల్‌ను ఉపయోగించుకుని విద్యార్థులు గణితంలో నూటికి నూరు శాతం మార్కులు సాధించవచ్చుపని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల గణిత ఉపాధ్యాయులు ఆకుల నాగేశ్వరరావు, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## బాల్య వివాహాలను ప్రోత్సహించకండి

**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** బాల్య వివాహాలు అనర్ధదాయకం అని వాటిని ఎవరు ప్రోత్సహించరాదని ఎంపిడివో మరియదేవి అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో వాసవ్య మహిళా మండలి ఆధ్వర్యంలో బాల్య వివాహ విముక్తి రథాన్ని ఎంపిడివో ప్రారంభించారు. బాల్య వివాహాలు సామాజిక రుగ్మతగా ఆమె పేర్కొన్నారు. అనంతరం స్థానిక ఉన్నత పాఠశాలలోని బాలికలకు బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏఎంసీ చైర్మన్తై మాట్లాడుతూ,తెలిసి తెలియని వయసులో వివాహం చేయడం వలన వారి ఆరోగ్య పరిస్థితులు క్షీణిస్తాయన్నారు. బడి ఈడు ఆడ పిల్లలందరూ బడిలోనే ఉండి చదువుపై శ్రద్ధ పెట్టాలని సూచించారు. 18 సం.ల లోపు ఆడపిల్లలకు బాల్యవివాహాలు జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే దగ్గరలోని అంగనవాడి కేంద్రాలకు గాని పోలీసు వారికి గాని సమాచారం అందజేయడం ద్వారా బాల్య వివాహాలను అరికట్టడంలో భాగస్వామములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ పర్యవేక్షకురాలు వనజ, డిప్యూటీ ఎంపిడివోలు కె.చంద్రశేఖర్, పద్మావతి, హై స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు కే సుజాత కార్యాలయ సిబ్బందితో పాటు అవనిగడ్డ పంచాయతీ కార్యదర్శి తోట శ్రీనివాసరావు, వాసవ్య మహిళా మండలి సభ్యురాలు శాంతి పాల్గొన్నారు.

## పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయకు బీజేపీ నివాళులు



**ఇబ్రహీంపట్నం మేజర్ న్యూస్:** జనసంఘ్ వ్యవస్థాపకులు, "అంత్యోదయ" కార్యక్రమానికి ఆద్యులు "ఏకాత్మ మానవతా సిద్ధాంత కర్త" భారతీయ జనతా పార్టీ మూల సిద్ధంత కర్త స్వర్గీయ పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ 58 వ వర్ధంతి సందర్భంగా బుధవారం కొండపల్లి మున్సిపాలిటీ భారతీయ జనతా పార్టీ ఆఫీస్‌లో మున్సిపాలిటీ అధ్యక్షురాలు తమ్మినేని మాధురి ఆధ్వ ర్యంలో ఆయనకు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యాక్ర మంలో పార్టీ సీనియర్ నాయకులు నూతులపాటి బాలకోటేశ్వర రావు (బాల),రేగళ్ల రఘునాద్ రెడ్డి,ప్రధాన కార్యదర్శులు దాము భవాని, సేనాపతి నాగమణి, కిసాన్ మోర్చా జి ఎస్ కునాల యుగంధర్, ఓబిసి మోర్చా సెక్రటరి కృష్ణ కుమారి, మహిళా మోర్చా అధ్యక్షురాలు కనకదుర్గా, మున్సిపాలిటీ సెక్రటరీ కృష్ణం రాజు, బెనర్జీ, సంజయ్,తిరుపతమ్మ, హిమాత్, రమణ మూర్తి, వెం కట పద్మారావు, సత్తిరాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పాడి పశువులకు చెవి పోగు వల్ల పథకాలు వర్తిస్తాయి

**పెడన మేజర్ న్యూస్ :** పాడిపశువులకు చిగురు ఏర్పాటు చేయడం వల్ల ప్రభుత్వం నుండి వచ్చే అనేక పథకాలు వర్తిస్తాయని పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి ఎన్‌సిహెచ్ నరసింహులు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన మండల పరిధిలోని చెన్నూరు, చేవేంద్ర గ్రామాల్లో పర్యటించడంతో పాటు పశువైద్యశాలల పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రి సిబ్బందికి దిశా నిర్దేశం చేశామన్నారు. పాడిపశువులకు కొన్ని చోట్ల చెవి పోగులు లేకపోవడాన్ని గుర్తించి తక్షణం వాటికి చెవిపోగులు వేయించాలని సూచించారు. చెవి పోగులు వల్ల సంబంధిత పాడి పశువులకు సకాలంలో టీకాలు ఎప్పుడు ఏ సమయంలో వేయాలనే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదై ఉంటాయని, పశువులు ఎక్కడైన తప్పిపోయినా వాటిని తక్షణం గుర్తించడానికి వీలుగా ఈ చెవిపోగులు తెలియజేస్తాయన్నారు. అలాగే పశువులకు భీమా సౌకర్యం కూడా ఈ చెవిపోగులు ద్వారా చేయించడం వల్ల పాడి రైతులకు లబ్ధి చేకూరుతుందని వివరించారు. ఈయనతో పాటు పశుసంవర్ధక శాఖ పెడన ఏడీ కొనకళ్ల బాబురావు, పశువైద్య సిబ్బంది, పాడి రైతులున్నారు.

## మద్యం షాపులో చోరీ

**పెడన మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని బల్లిపర్రు గ్రామంలో గల దేవి వైన్స్‌లో దొంగలు పడి నగదును దోచుకుపోయారని ఆ షాపు వర్కరు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు సంఘటన స్థలం వద్దకు వచ్చి పరిశీలించారు బుధవారం వేకువ జామున అంటే సుమారు 3 గంటల సమయంలో ఇద్దరు దొంగలు వైన్‌షాపు తాళాలలను పగులగొట్టి దూరంగా పొలాల్లో పడేసి లోపలకు ప్రవేశించి ఉంటారని నిర్ధారించుకున్నారు. దుకాణంలోని నగదు కౌంటరులో సుమారు రూ.9వేలు నగదు, నాలుగు మద్యం సీసాలు (రెండు ఫుల్, రెండు క్వార్టర్లు)తీసుకుపోయారని దుకాణా వర్కరు గిరి పెడన పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలాన్ని పెడన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె నాగేంద్రప్రసాద్, పెడన ఎస్ఐ2 షేక్ బషీర్‌లు తమ సిబ్బందితో పరిశీలించారు. క్లూస్ టీం అధికారులు వచ్చి వేలిముద్రలను సేకరించారు. దొంగలు వైన్‌షాపులోకి ప్రవేశించడం, నగదు దోచుకోవడం, వెళ్లిపోవడం వంటి సన్నివేశాలన్ని సీసీ కెమెరాల్లో రికార్డు కావడంతో వచ్చింది ఎవరనే దానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు. గిరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసు అధికారులు తెలిపారు

# ఏపీలో వృద్ధి లక్ష్యంగా రియల్ ఎస్టేట్ ప్రణాళికలు

### జాతీయ పట్టణాభివృద్ధి సదస్సుకు ఏపీ సిద్ధం




**విజయవాడ, ఫిబ్రవరి 2026, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్‌లో విస్తరిస్తున్న మౌలిక సదుపాయాలు, పట్టణీకరణను జాతీయ స్థాయిలో ప్రదర్శించేందుకు రాష్ట్ర రియల్ ఎస్టేట్ రంగం సిద్ధమైంది. ఈనెల 13, 14వ తేదీల్లో న్యూఢిల్లీలోని 'యశోభూమి'లో జరగనున్న 'జాతీయ పట్టణ, రియల్ ఎస్టేట్ అభివృద్ధి సదస్సు 2026'లో నరెడ్కో ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రతినిధులు పాల్గొననున్నారు. అమరావతి, విశాఖపట్నం సహా రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో జరుగుతున్న అభివృద్ధిని, పెట్టుబడి అవకాశాలను ఈ వేదిక ద్వారా దేశవ్యాప్త పారిశ్రామికవేత్తల ముందు ఉంచనున్నారు. ఈ సందర్భంగా నరెడ్కో ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు జీ చక్రధర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రియల్ ఎస్టేట్ రంగం ప్రస్తుతం స్థిరమైన వృద్ధిని సాధిస్తోందన్నారు. భారీ మౌలిక సదుపాయాల అభివృద్ధి, మెరుగైన రవాణా సౌకర్యాలు రాష్ట్రవ్యాప్తంగా పట్టణ కేంద్రాల వేగవంతమైన విస్తరణ ఈ వృద్ధికి ప్రధాన కారణాలు అన్నారు. క్వాంటం వ్యాలీలు, ఇన్నోవేషన్ హబ్‌లు, ఐటీ రంగం, డేటా సెంటర్లు, గ్రీన్ ఎనర్జీ కారిడార్లు, ఆటోమొబైల్ పరిశ్రమలు, ఎక్స్‌ప్రెస్‌వేలు, మెట్రో ప్రాజెక్టులు, గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయాలు, పారిశ్రామిక కారిడార్లు, వేర్‌హౌస్‌లు, లాజిస్టిక్స్, షిప్పింగ్, ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్‌లలో వ్యూహాత్మక పెట్టుబడులతో ఆంధ్రప్రదేశ్ తన పట్టణాభివృద్ధి ప్రయాణాన్ని, భవిష్యత్తు ప్రాధాన్యతలను ప్రపంచానికి చాటి చెప్పేందుకు సిద్ధమవుతోందన్నారు. ఈ సదస్సు వివిధ రాష్ట్రాలు తమ అభివృద్ధి, భవిష్యత్తు ప్రణాళికలను పంచుకోవడానికి ఒక వేదికగా నిలవనుందన్నారు. ఆంధ్రప్రదేశ్ ఈ వేదికపై ప్రధానంగా ఈ క్రింది అంశాలను ప్రదర్శించనుందని పేర్కొన్నారు. పట్టణ మౌలిక సదుపాయాల బలోపేతం, గృహాల లభ్యతను పెంచడమన్నారు. అమరావతి, విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, తిరుపతి, కర్నూలు వంటి నగరాలతో పాటు ఎదుగుతున్న ఇతర పట్టణ కేంద్రాల ప్రణాళికాబద్ధమైన వృద్ధి కూడా అన్నారు. మెట్రో రైలు విస్తరణ, పారిశ్రామిక కారిడార్లు, లాజిస్టిక్ హబ్‌లు, స్మార్ట్ సిటీ ప్రాజెక్టులు, ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్‌లపై ప్రత్యేక దృష్టి ఉందన్నారు. సులభతర వాణిజ్యం, నియంత్రణ సంస్కరణలు, సాంకేతికతతో కూడిన పాలన ద్వారా రియల్ ఎస్టేట్, మౌలిక సదుపాయాల రంగాలలో పెట్టుబడులను ఆకర్షించడంలో రాష్ట్రం సాధించిన విజయాన్ని దేశవ్యాప్త పరిశ్రమల భాగస్వాముల ముందు ప్రదర్శించనున్నారని తెలిపారు. దేశ రియల్ ఎస్టేట్ రంగం ప్రస్తుతం ఒక కీలక దశలోకి ప్రవేశిస్తోందన్నారు. స్థిరమైన ఆర్థిక వృద్ధి, వేగవంతమైన పట్టణీకరణ, ప్రభుత్వ అనుకూల విధానాలు దీనికి వెన్నుదన్నుగా నిలుస్తున్నాయని తెలిపారు. 2047 నాటికి దేశంలో పట్టణీకరణ 50 శాతానికి చేరుకుంటుందని అంచ నా వేస్తున్న నేపథ్యంలో సమర్ధవంతమైన, పారదర్శ కమైన, సాంకేతికతతో కూడిన పట్టణాభివృద్ధి వ్యవస్థ ల ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. పట్టణాలలో జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి, పెట్టుబడిదారుల నమ్మకాన్ని బలోపేతం చేయడానికి, దీర్ఘకాలిక వృద్ధికి అవసరమైన కార్యాచరణను రూపొందించడమే ఈ సదస్సు లక్ష్యమన్నారు. మెట్రో రైలు, పారిశ్రామిక కారిడార్లు, విమానాశ్రయాలు, హైవే కనెక్టివిటీలో నిరంతర పెట్టుబడుల కారణంగా ఆంధ్రప్రదేశ్‌లో పట్టణ రూపురేఖలు మారిపోతున్నాయని తెలిపారు. ఇది విశాఖపట్నం, విజయవాడ, అమరావతి, తిరుపతి వంటి నగరాల్లో రియల్ ఎస్టేట్ కార్యకలాపాలను వేగవంతం చేస్తోందన్నారు. మెరుగైన విధానాలు, మౌలిక సదుపాయాల ఆధారిత వృద్ధి ఫలితంగా నివాస, వాణిజ్య, పారిశ్రామిక రంగాలలో కొత్త అవకాశాలు లభిస్తున్నాయని తెలిపారు. ఈ సదస్సు ద్వారా ఆంధ్రప్రదేశ్ సాధించిన పట్టణాభివృద్ధి అనుభవాలను పంచుకోవడానికి, సమగ్ర వృద్ధిపై జరిగే చర్చల్లో భాగస్వాములు కావడానికి నరెడ్కో ఆంధ్రప్రదేశ్ ఆసక్తిగా ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నరెడ్కో చైర్మన్ డాక్టర్ నిరంజన్ హిరానందని మాట్లాడుతూ భారతదేశ వృద్ధి పథంలో అత్యంత కీలకమైన సమయంలో ఈ 'జాతీయ పట్టణ, రియల్ ఎస్టేట్ అభివృద్ధి సదస్సు 2026' జరుగుతోందని తెలిపారు. రియల్ ఎస్టేట్ అనేది కేవలం ఒక ప్రత్యేక రంగం మాత్రమే కాదని, ఇది ఆర్థిక విస్తరణకు, ఉపాధి కల్పనకు, పట్టణ పరివర్తనకు ప్రధాన చోదక శక్తిగా మారిందని పేర్కొన్నారు. రవాణా ఆధారిత అభివృద్ధి, నియంత్రణ సంస్కరణలు, సంస్థాగత పెట్టుబడులు, డిజిటల్ గవర్నెన్స్‌పై ఈ సదస్సులో జరిగే లోతైన చర్చలు భవిష్యత్తు అవసరాలకు సిద్ధంగా ఉండే రియల్ ఎస్టేట్ వ్యవస్థకు బాటలు వేస్తాయన్నారు. పెరుగుతున్న పట్టణ జనాభా నేపథ్యంలో 'వికసిత్ భారత్ 2047' దార్శనికతకు అనుగుణంగా, విభిన్న వాటాదారులను, వినూత్న ఆలోచనలను ఒకచోట చేర్చి ప్రపంచ స్థాయిలో పోటీ పడగల స్థిరమైన పట్టణ వ్యవస్థను నిర్మించడానికి ఈ సదస్సు ఒక కీలక వేదికగా ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా నరెడ్కో అధ్యక్షుడు ప్రవీణ్ జైన్ మాట్లాడుతూ నిర్మాణాత్మకమైన చర్చలు, ఆచరణాత్మక సంస్కరణల ద్వారా మాత్రమే స్థిరమైన పట్టణాభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. ఈ సదస్సు ప్రధానంగా నియంత్రణల సమన్వయం, పెట్టుబడిదారుల విశ్వాసాన్ని పెంపొందించడం, సాంకేతికతను అందిపుచ్చుకోవడం వంటి అంశాలపై దృష్టి సారిస్తుందని పేర్కొన్నారు. ఈ రంగం తదుపరి దశ వృద్ధికి ఇవి అత్యంత అవసరం అన్నారు.



## ఆధ్యాత్మికతతో కూడిన విహారయాత్రలో ఏపీయుడబ్ల్యూజే నేతలు

### అంతర్వేది, పంచారామ క్షేత్రాల సందర్శనలో పాత్రికేయులు



**హనుమాన్ జంక్షన్, ఫిబ్రవరి 11, మేజర్ న్యూస్ :** అనునిత్యం విధి నిర్వహణలో క్షణం తీరిక లేకుండా గడిపే పాత్రికేయులు మంగళవారం విరామం తీసుకుని విహారయాత్రకు వెళ్లారు. ఏపీ యుడబ్ల్యూజే కృష్ణా జిల్లా ఉపాధ్యక్షులు అట్లూరు రాజశేఖర్ నేతృత్వంలో గన్నవరం నియోజకవర్గానికి చెందిన పాత్రికేయ బృందం ప్రత్యేక వాహనంలో ఈ యాత్రను నిర్వహించింది. గన్నవరం నుంచి అంతర్వేది చేరుకున్న వారు అక్కడ లక్ష్మీ నరసింహ స్వామి ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అంతర్వేది సముద్ర తీరంలో సముద్ర స్నానాలు చేసి సముద్ర జలాల్లో సేదతీరుతూ బీచ్‌లో ఉల్లాసంగా గడిపారు. పడవలో సాగర సంగమం వద్దకు వెళ్లి గోదావరి నది బంగాళాఖాతంలో కలిసే అద్భుత దృశ్యాన్ని తిలకించారు. తిరుగు ప్రయాణంలో పంచారామ క్షేత్రాలలో భాగమైన పాలకొల్లు, భీమవరం శైవ ఆలయాలను సందర్శించి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే భీమవరం మావుళ్లమ్మ అమ్మవారిని కూడా దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా ఉపాధ్యక్షులు ధనియాల అప్పారావు, సీనియర్ నాయకులు కోడూరు రామకృష్ణ, మలిశెట్టి సుబ్రహ్మణ్యం, యూనియన్ సభ్యులు అక్కినేని శ్రీనివాస ఫణీంద్ర, ధారావతు హరికృష్ణ, నల్లగంచు రామకృష్ణ, వడ్డి సురేష్, రెడ్డి రఘుబాబు, లంక రమేష్, మాతంగి కిషోర్, దాసరి చెంచు కృష్ణ, జుబేర్ తదితరులు పాల్గొన్నారు..

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ స్థాయి సింపోజియం



**అవనిగడ్డ, మేజర్ న్యూస్:** వికసిత్ భారత్ 2047 లో భాగంగా విద్యార్ధులకు 2026– యూనియన్ బడ్జెట్ పై అవగాహన కల్పించారు. బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మన టీవీ భవన్లో జరిగిన కార్యక్రమానికి ప్రిన్సిపాల్ డా. డి. ఉమా రాణి అధ్యక్షత వహించారు. అర్థశాస్త్ర విభాగ అధిపతి డా ఏ.వీరకుమారి ఆధ్వర్యంలో కళాశాల వికసిత్ భారత్ 2047 సాధనలో కేంద్ర బడ్జెట్‌ల పాత్ర – 2026 బడ్జెట్ అంతర్దృష్టి విశ్లేషణ అనే అంశంపై ఒక రోజు జాతీయ స్థాయి సింపోజియం నిర్వహించారు.ఈ సింపోజియంలో 2047 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా (వికసిత్ భారత్) తీర్చిదిద్దడంలో ప్రస్తుత బడ్జెట్ కేటాయింపులు, మౌలిక సదుపాయాల కల్పన, ఆర్థిక సంస్కరణల ప్రాముఖ్యత, విద్యా,వైద్యరంగంలో పెట్టుబడుల పెంపు ఆవశ్యకత, రక్షణ రంగము, ఉపాధి హామీ కార్యక్రమాలపై పెట్టుబడుల పెంపు, శ్రమసాంద్రత ఉత్పత్తి పద్ధతుల కు ప్రాధాన్యత, పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అర్థశాస్త్ర అధ్యాపకులు మైలవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుండి డా. షేక్ కరీముల్లా, రేపల్లె ఏ.బి.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుండి డా. కె. భాస్కర రావు, సదాశివపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుండి డా. పి. మురళీకృష్ణ తమ అమూల్యమైన విశ్లేషణలను అందించారు. ఖమ్మం ఎస్.ఆర్ & బి.జి.ఎన్.ఆర్ ప్రభుత్వ కళాశాల నుండి డా. ఎం. పిచ్చయ్య, మొవ్వ వి.ఎస్.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుండి డా. జి. సురేష్ బాబు, బంటుమిల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుండి జె. చలం ప్రసాద్ 2026 కేంద్ర బడ్జెట్ ద్వారా దేశం సాధించబోయే ఆర్థిక వృద్ధిని వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ –డా.జి నాగార్జున, ఐక్యుఏసి కోఆర్డినేటర్ –ఆర్ అంకారావు, కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# 20 నెలల్లో కూటమి ప్రభుత్వ సూపర్ హిట్ పాలన

**ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వర రావు**

**90% సూపర్ సిక్స్ హామీలు అమలు**

**ప్రజల్లో పూర్తి సంతృప్తి, స్వర్ణాంధ్ర విజన్ @2047**

**అభివృద్ధి దిశగా దృఢ సంకల్పం**



**విజయవాడ సెంట్రల్, మేజర్ న్యూస్ :** " సింగ్ నగర్ లోని సెంట్రల్ నియోజకవర్గం ఎమ్మెల్యే కార్యాలయంలో బుధవారం ప్రభుత్వ విప్, సెంట్రల్ నియోజకవర్గ శాసన సభ్యులు బొండా ఉమామహేశ్వరరావు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విలేకరులను ఉద్దేశించి బొండా ఉమా మాట్లాడుతూ 20 నెలల కూటమి ప్రభుత్వ పాలనలో కూటమి ప్రభుత్వ విజయాలపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారని తెలియజేశారు, చేబుల్లో కూడా ఆర్థిక సంక్షోభంలో కూడా ఈ 20 నెలల కాలంలో కూటమి ప్రభుత్వం ఎన్నో విజయాలు సాధించింది అని, సంక్షేమం అభివృద్ధి సామాజిక న్యాయం సుపరిపాలనే ధ్యేయంగా పతనం నుండి ప్రగతివైపు రాష్ట్ర పుర నిర్మాణం కోసం నాయుడు ముఖ్యమంత్రి వారిలో నారా చంద్రబాబు నాయుడు అపారమైన అనుభవంతో అనునిత్యం పని చేసి హాయ్ సంతృప్తి కల స్థాయికి తీసుకొని వచ్చారని తెలియజేశారు. ఈ 20 నెలల కాలంలో అనేక సవాళ్లను అధిగమించి ఆంధ్రప్రదేశ్ బ్రాండ్ పునరుద్ధరణతో ప్రజల ఆశలు నెరవేరుస్తూ స్వర్ణాంధ్ర విజన్ @2047 లక్ష్యంతో తలసరి ఆదాయం 55 లక్షల పెంపునకు బాటలు వేస్తుంది బాటలు వేస్తుంది అని, ఈ 20 నెలల కాలంలో సూపర్ సెక్స్ హామీలలో 90 శాతం నెరవేర్చింది అని, గత వైఎస్ఆర్సిపి ప్రభుత్వం ఐదు సంవత్సరాల కాలంలో 80 శాతం హామీలను కూడా నెరవేర్ లేకపోయిందని విమర్శించారు. సూపర్ సెక్స్ సూపర్ హిట్ అని ప్రజలందరూ అనుకుంటున్నారని తల్లికి వందనం పథకం 10,090 కొట్లు నేరుగా ఆడపడుచుల ఖాతాలలో జమ అయ్యాయని, 67.27 లక్షల మంది విద్యార్థులకు సహాయం చేశామని తెలిపారు. శ్రీ శక్తి పథకం ద్వారా ఐదు కోట్లకు పైగా మహిళా సోదరీమణులు ఉచిత బస్సు ప్రయాణాలు చేశారని రూ. 1,513 కొట్ల ఖర్చు ఈ పథకం ద్వారా చేశామని, దీపం 2 పథకం ద్వారా ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేస్తున్నామని ఇప్పటివరకు ఈ పథకం ద్వారా 3.64 కోట్ల రూపాయలు ఖర్చు చేశామని, అన్నదాత సుభిక్షం కోసం 46 లక్షల మంది రైతులకు రెండు విడతలుగా రూ. 6,310 కోట్లు జమ చేశామని, మెగా డీఎస్సీ ప్రకటించి ముఖ్యమంత్రి తొలి సంతకం చేశారని 15,941 టీచర్ పోస్టు భర్తీ చేశామని, 5757 కానిస్టేబుల్ నియామకాలు చేపట్టామని అన్నారు. 21 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు తీసుకొని వచ్చామని 25 లక్షల మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించామని,గ్రా-4 పథకం ద్వారా 10 లక్షల మంది మహిళలకు 50 వేల నుండి 2 లక్షల వరకు లబ్ధి చేకూర్చామని, ఎన్టీఆర్ భరోసా ద్వారా ప్రతినెల 63 లక్షల మందికి పెన్షన్లు పంపిణీ చేస్తున్నామని, ఇప్పటివరకు 58,654 కోట్ల రూపాయలు వ్యయం చేశామని దేశంలో అత్యధిక మొత్తంలో ఇంతమందికి పెన్షన్లు ఇస్తున్నటువంటి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ రికార్డు సృష్టించిందని తెలియజేశారు. దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం, ఇతనే అవకాశం దివ్యాంగులు రాష్ట్రంలో ఎక్కడైనా పెన్షన్ తీసుకునే అవకాశం, మత్స్యకార సేవ పథకం ద్వారా ఏడాదికి 20 వేల రూపాయల చొప్పున 1.25 లక్షల మందికి 250 కోట్ల రూపాయలు జమ, నాయి బ్రాహ్మణులకు నెలకు 25 వేలు జూనియర్ లాయర్లకు నెలకు 10 వేల గౌరవ వేతనం చెల్లిస్తున్నామని అన్నారు. నేతన్నలకు ఉచిత విద్యుత్ మరమకాలకు నెలకు 200 యూనిట్లు వరకు ఉచితం, గీత కార్మికులకు 10% మద్యం షాపులు కేటాయించి స్వర్ణకారులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు, ఆటో డ్రైవర్ల సేవ పథకం ద్వారా ఏడాదికి 15 వేల రూపాయలు ఇప్పటికీ రూ.430 కోట్లు జమ చేశామని ఈ 2.90 లక్షల మంది ఆటో కార్మికులకు లబ్ధి చేకూరిందని, అన్నా క్యాంటీన్ల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 205 అన్నా క్యాంటీన్లు ఇప్పటివరకు 7.50 కోట్ల మంది భోజనం చేశారని అన్నారు. ఎస్సీ వర్గీకరణ చేసి వివాదాలకు దారి ఇవ్వకుండా అన్ని వర్గాలకు సమన్యాయం చేశామని తెలిపారు. 8427 మంది పాస్టర్లకు నెలకు 5000 వేల రూపాయలు గౌరవ వేతనం, ఇమాములకు నెలకు పదివేల చొప్పున, మౌజనులకు నెలకు 5000 చొప్పున, అర్చకులకు నెలకు 15 వేల చొప్పున గౌరవ వేతనం చెల్లిస్తున్నామని, రాష్ట్రవ్యాప్తంగా మరమ్మత్తులు 1000 కోట్ల రూపాయలతో రోడ్ల మరమ్మత్తులు, 3000 వేలకోట్లతో కొత్త దారుల నిర్మాణం తల్లి పండుగ ద్వారా గ్రామాలలో 4000 కిలోమీటర్ల రోడ్లు, రాజముద్రతో కొత్త పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ రెవిన్యూ సంస్కరణలతో ముందుకు వెళ్తున్నామని తెలిపారు. పంచాయితీ రాజ్ శాఖ ద్వారా ఒకే రోజు 13,326 గ్రామసభలు పెట్టి 3000 వేల పనులకు శ్రీకారం చుట్టామని 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేశామని, విద్యా రంగంలో భారీ సంస్కరణలు చేపట్టి మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్స్ ఏర్పాటు చేసి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ద్వారా నాణ్యమైన భోజనం సరఫరా చేస్తున్నామని, సర్వేపల్లి రాధాకృష్ణ కిడ్స్ పంపిణీ, టీచర్ల బదిలీ పారదర్శకంగా చేసి పాఠశాలలలో మౌలిక వసతుల ను పెంపొందించామని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి పౌరుడికి గెట్స్ ఫౌండేషన్ టాటా ఫౌండేషన్ల సౌజన్యంతో సంజీవని ప్రాజెక్టు ద్వారా ఆరోగ్య బీమా కల్పించామని తెలిపారు, విద్యుత్ రంగంలో మునుపెన్నడు లేనటువంటి విధముగా యూనిట్ కు 13 పైసలు చార్జీలు తగ్గించామని ఇప్పటికీ ప్రభుత్వం 4490 కోట్ల బకాయిల భారం భరిస్తుందని తెలిపారు. అంగన్వాడీలకు గ్రాబ్యూటీ అమలు చేశామని, బాలింతలకు ఎన్టీఆర్ బేబీ కిట్లు అందిస్తున్నామని, చంద్రన్న కిట్లు అందిస్తున్నామని, ప్రతి మూడవ శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం ద్వారా ఇప్పటివరకు రాష్ట్రంలో 105 లక్షల టన్నులు చెత్తను తరలించామని తెలియజేశారు. 175 నియోజకవర్గాలలో ఎంఎస్ఎంఇ పార్కులు ఏర్పాటుచేసి యువ పారిశ్రామికవేత్తల ప్రగతికి తోడ్పాటు అందిస్తున్నామని తెలిపారు. విశాఖలో 15 మిలియన్ డాలర్లతో గూగుల్ ఏఐ డేటా సెంటర్లను నెలకొల్పుతున్నామని, అమరావతిలో ప్రతిష్టాత్మకంగా క్వాంటం వ్యాలీ నెలకొల్పుతున్నామని, త్వరలో అమరావతిలో రిలయన్స్ డేటా సెంటర్, టిసిఎస్ కూడా ప్రారంభమవుతున్నాయని తెలిపారు... 20 కి పైగా దేవాలయాల్లో నిత్య అన్నదానం చేపడుతున్నామని, పేదలకు గ్రామాలలో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు స్థలాలను కేటాయిస్తున్నామని, వచ్చే ఉగాది కి 3 లక్షల ఇళ్లకు గృహప్రవేశాలు చేపడుతున్నామని, ఉచిత ఇసుక పథకం ద్వారా ప్రజలందరికీ ఉచితంగా ఇసుకను సరఫరా చేస్తున్నామని తెలిపారు... ప్రజలందరూ ఇది మంచి ప్రభుత్వం స్వర్ణాంధ్రను సాధించే కూటమి ప్రభుత్వంగా భావిస్తున్నారని, రాబోయే మూడున్నర సంవత్సరాల కాలంలో ఇచ్చినటువంటి హామీలే కాక ఆంధ్రప్రదేశ్ను ప్రగతి పథంలో నడిపించి ప్రజలకు అభివృద్ధి సంక్షేమం సమపాలనలో అందే విధంగా కేంద్ర ప్రభుత్వ సహకారంతో కూటమి ప్రభుత్వం ముందుకెళుతుందని తెలిపారు. ఈ సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి సెంట్రల్ నియోజకవర్గం కోఆర్డినేటర్ నవనీతం సాంబశివరావు, ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ఘంటా కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

# నగరంలో నిరంతరాయంగా డీసిల్టింగ్ పనులు జరుగుతూ ఉండాలి



**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** నగరంలో నిరంతరాయంగా డీసిల్టింగ్ పనులు జరుగుతూ ఉండాని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. బుధవారం ఉదయం తన పర్యటనలో భాగంగా వన్ టౌన్ నైజాం గేట్, కేఎల్ రావు ఔటఫాల్ డ్రైన్, ఊర్మిళ సుబ్బారావు నగర్ ఔటఫాల్ డ్రైన్, హౌసింగ్ బోర్డ్ కాలనీ ప్రాంతాలన్నీ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నైజాం గేట్ ఔటఫాల్ డ్రైన్ వద్ద పేరుకుపోయిన వ్యర్థాలను చూసి, డిసిల్టింగ్ పనులు ఎందుకు చేయటం లేదని అక్కడ ఉన్న సిబ్బందిని అడగగా వారు ఎక్కులేటర్ మరమ్మతులో ఉండటం వలన చేయలేకపోతున్నామని తెలుపారు. పారిశుధ్య నిర్వహణకు సంబంధించి ఏ వాహనమైన త్వరగా మరమ్మతులు చేయించి వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని, మరమ్మతులకు ఆలస్యం అవరాదని, ఇంజనీరింగ్ పై ఆగ్రహించారు. ఊర్మిళ సుబ్బారావు నగర్ ఔటఫాల్ డ్రైన్ డిసిల్టింగ్ పనులు పూర్తయ్యాయా లేదా అని పరిశీలించేందుకు అక్కడ రోడ్డు లేకపోవడంతో డ్రోన్ ద్వారా పరిశీలించి మిగిలిన డీసిల్టింగ్ పనులను పూర్తిగా చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ఉన్న ఔటఫాల్ డ్రైన్ లలో నిరంతరాయంగా డీసిల్టింగ్ పనులను చేస్తుండాలని, డీసిల్టింగ్ చేసే ప్రక్రియలో మెషిన్లు పాడైపోయినచో వెంటనే వాటిని మరమ్మతులు చేయించి త్వరగా అందుబాటులోకి తీసుకువచ్చి డీసెల్టింగ్ ప్రక్రియకు ఏ మాత్రం భంగం కలిగించరాదని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ప్రజారోగ్యం సిబ్బంది, ఇంజనీరింగ్ సిబ్బంది సమన్వయంతో పనిచేసి డీసిల్టింగ్ పనులను త్వరగా పూర్తిచేసే ఔట్ఫాల్ట్ డ్రైన్ లలో ఎటువంటి అడ్డంకులు లేకుండా త్వరితగతిన సిల్టును తొలగించాలని అన్నారు. తదుపరి హౌసింగ్ బోర్డ్ కాలనీలో గల అన్నా క్యాంటీన్ ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పారిశుధ్య నిర్వహణలో లోపం ఉండరాదని త్రాగునీరు వాడుక నీటి సరఫరా లో అంతరాయం ఉండరాదని ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించాలని అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఏమైనా మరమ్మతులు ఉన్నచో వెంటనే వాటిని పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ రమ్య కీర్తన, డిప్యూటీ సిటీ ప్లానర్ చంద్రబోస్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జె.శ్రీనివాస్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, సిబ్బంది పాల్గొన్నారు.











## రైజ్ నైపుణ్యంతో ఆర్థిక స్వావలంబన

**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 11, మేజర్ న్యూస్ :** మహిళల ఆర్థిక స్వావలంబన సాధనలో భాగంగా ఇబ్రహీంపట్నం మండలం, గుంటుపల్లి రైజ్ కేంద్రం ద్వారా అందిస్తున్న నైపుణ్య శిక్షణ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది. ఈ కార్యక్రమం ద్వారా మహిళలకు ఆధునిక నైపుణ్యాలు, వ్యాపార నిర్వహణ పాఠాలు, డిజిటల్ పరిజ్ఞానం అందిస్తూ స్వయం ఉపాధి అవకాశాలను విస్తరించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. మహిళల ఉపాధిని విస్తృతం చేసే సమగ్ర కార్యక్రమాల ద్వారా గ్రామీణ ప్రాంతాల మహిళలకు ప్రత్యేక శిక్షణలు, ఆర్థిక సహాయం, మార్కెటింగ్ మార్గదర్శకత అందిస్తున్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళల్లో వ్యాపార నైపుణ్యాల పెంపు, చిన్న, సూక్ష్మ వ్యాపారాల స్థాపనకు ప్రోత్సాహం కల్పిస్తున్నారు. "వన్ ఫ్యామిలీ వన్ ఆంత్రప్రెన్యూర్" లక్ష్యంతో ప్రతి కుటుంబంలో కనీసం ఒకరిని వ్యాపారవేత్తగా తీర్చిదిద్దే దిశగా ఈ కార్యక్రమం ముందుకు సాగుతోంది. దీనివల్ల కుటుంబ ఆర్థిక స్థితి మెరుగుపడటమే కాకుండా, సమాజంలో మహిళల సాధికారతకు దోహదపడుతుంది. రైజ్ కేంద్రం ద్వారా నిరంతర శిక్షణ కార్యక్రమాల్లో భాగంగా బుధవారం సోలార్ టెక్నీషియన్ ట్రైనింగ్ ఇవ్వడం జరిగింది. ఈ రంగం ప్రస్తుతం వడివడిగా ముందుకెళ్తున్న నేపథ్యంలో స్వయం ఉపాధి అవకాశాలు విస్తృతం కానున్నాయి.

# రెవెన్యూ రికార్డులను పటిష్టపరిచి సమర్ధవంతంగా విధులు నిర్వహించాలి







**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** జిల్లాలో రెవెన్యూ అంశాలపై పట్టు సాధించి రెవెన్యూ రికార్డులను పటిష్టపరిచి సమర్ధవంతంగా విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ నగరంలోని కలెక్టరేట్ మీకోసం సమావేశం మందిరంలో సంయుక్త కలెక్టర్ ఎం నవీన్, సహాయ కలెక్టర్ ఫర్హీన్ జాహిద్ తో కలసి రెవెన్యూ అధికారుల సమీక్ష సమావేశం నిర్వహించి రెవెన్యూ క్లినిక్, అధికారాల వినియోగం, 22 ఏ కేసుల పరిష్కారం, రీ సర్వే, జాయింట్ ఎల్ పి ఎం, పిజిఆర్ఎస్ మీకోసం, ఐవిఆర్ఎస్ ప్రజా స్పందన, ఈ కేవైసీ, పట్టాదారు పాసు పుస్తకాలు,కోర్టు కేసులు, సీనియర్ సిటిజెన్లు, ఎన్నికల అంశాలపై సుదీర్ఘంగా సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూ వివాదాలకు సంబంధించి రెవెన్యూ అంటేనే రికార్డులను పరిశీలించి అన్ని విధాల విచారించి నిర్ణయం తీసుకొని దానికి అనుగుణంగా ఉత్తర్వులు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. రీ సర్వేలో తప్పులు చేస్తే చారిత్రాత్మక తప్పులుగా నిలిచిపోతాయని గుర్తించుకొని చాలా జాగ్రత్తగా తప్పులు లేకుండా రీ సర్వే చేయాలన్నారు. రీ సర్వేకు సంబంధించి జరిగే గ్రామ సభలకు తహసీల్దార్లు తప్పనిసరిగా హాజరై స్పీకింగ్ ఉత్తర్వులను ఇవ్వాల్సి ఉందన్నారు. అయినప్పటికీ కొందరు అలా చేయడం లేదన్నారు. ఇకనైనా ఈ విషయం తీవ్రంగా పరిగణించి అలా కాకుండా చూడాలన్నారు. రెవిన్యూ డివిజనల్ అధికారులు మండలాల్లో సర్వే సిబ్బంది వీఆర్వోలతో సమావేశం నిర్వహించి వివరాలు సేకరించాలన్నారు. రీ సర్వేలో విస్తీర్ణం 5 శాతానికి మించినప్పుడే ఇరువురి సంబంధిత భూహక్కుదారులతో మాట్లాడి జాగ్రత్తగా భూముల పరిష్కారం చేయాలన్నారు. రెవెన్యూ క్లినిక్‌లలో వచ్చే అర్జీలపై పద్ధతి ప్రకారం సరైన చర్యలు తీసుకోవడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి అర్జీని సరైన అవగాహన చేసుకోకుండా ఆలోచన చేయకుండా పిజిఆర్ఎస్ మీకోసంలో పోస్ట్ చేస్తున్నారని, అది సరైనది కాదని స్పష్టం చేశారు. దీనివలన ప్రజలతోపాటు రెవెన్యూ సిబ్బందికి ఇబ్బంది ఉంటుందన్నారు. అర్జీ పరిష్కారం కాకపోవడమే కాకుండా సమయం కూడా వృధా అవుతుందన్నారు. సరైన అవగాహన చేయకుండా సమస్య పరిష్కారం కానందున మరల అర్జీలు పెట్టడం మొదలవుతుందన్నారు. రెవెన్యూ క్లినిక్‌ల ఏర్పాటు ప్రధాన లక్ష్యం ఎట్టి పరిస్థితుల్లోనూ దెబ్బతినకూడదన్నారు. రెవెన్యూ క్లినిక్‌లో వచ్చే అర్జీలను సేవా పోర్టల్‌లో నమోదు చేసి తగిన విధంగా పరిష్కరించాలన్నారు. జిల్లాలో రెవిన్యూ క్లినిక్‌లకు సంబంధించి విశ్లేషించగా 73 అర్జీలు రాగా అందులో 47 అర్జీలను సేవ పోర్టల్‌లో పెట్టలేదన్నారు. దీనివలన అవన్నీ మరల వచ్చే అవకాశం కల్పిస్తున్నారన్నారు. సేవలకు సంబంధించి, ఓ ఆర్ సి ఎం ఎస్ కు సంబంధించి అర్జీలకు కాకుండా మిగిలినవి పిజిఆర్ఎస్ మీకోసంలో పోస్ట్ చేయాలన్నారు. 22 ఏ నిషేధిత జాబితా నుండి తొలగించే అంశాన్ని అర్జీలను సేవల పోర్టల్‌లో పెట్టాలి గాని, పీజిఆర్ఎస్ మీకోసంలో పెట్టకూడదన్నారు. రీ సర్వే చేసినప్పుడు భూముల విస్తీర్ణంలో ఎకరాకు 5 శాతం మించి ఉంటేనే ప్రభుత్వ సర్క్యులర్ ప్రకారం తగిన చర్యలు తీసుకొని సరిచేయాలన్నారు. పక్కనున్న రైతులకు అర్హతకు మించి భూమి రికార్డు అయి ఉంటే ఇద్దరి ఒప్పందం తో సరి చేయాలన్నారు. గ్రామ కంఠం ప్రభుత్వ భూమని దాన్ని సబ్ డివిజన్ చేయలేమన్నారు. అయితే భూ పరిపాలన ముఖ్య కమిషనర్ కార్యాలయానికి ఈ ఆఫీస్ ద్వారా వేరుగా ప్రతిపాదనలు పంపించాల్సి ఉంటుందన్నారు. రికార్డ్ ఆఫ్ రైట్స్ ఆర్ఓఆర్‌లో ఏమైనా అనుమానాలు ఉంటే తన దృష్టికి తీసుకుని రావాలన్నారు తొందరపడి నిర్ణయం తీసుకోరాదని స్పష్టం చేశారు. భూమిపై ఎవరు ఉంటే వారికి హక్కు కాదని రికార్డుల ప్రకారం ఉండాలన్నారు. దున్నే ప్రతి భూమికి ఒక సర్వే నంబరు తప్పనిసరిగా ఉండాలని, సాదా బైనామా విధానంలో దున్నే వారి పేరు విచారించి నిర్ధారించి రికార్డులో నమోదు చేయాలన్నారు. భూమి బదిలీ చేయుటకు నిర్ణయం అధికారం గుర్తుపెట్టుకోవాలన్నారు. భూహక్కుదారులతో మాట్లాడి ప్రతి నిర్ణయానికి తప్పనిసరిగా ఉత్తర్వులు ఉండాలన్నారు. ఉత్తర్వులు ఎఫ్ఎంబి ఒకటిగానే ఉండాలన్నారు. జాయింట్ ఎల్ పి ఎం ఉంటే పద్ధతి ప్రకారం అవగాహన లేకుండా చేస్తే సమస్య వస్తుందన్నారు.సంయుక్త కలెక్టర్ మాట్లాడుతూ 4 వ విడత రీ సర్వే కార్యక్రమంలో గ్రౌండ్ ట్రూతింగ్ దశలవారీగా జరుగుతోందని అందుకు సంబంధించిన నివేదికలు ప్రతిరోజు ఆర్డీవోలు తప్పనిసరిగా పంపించాలన్నారు. భూముల సబ్ డివిజన్ చేసే విషయంలో చాలా జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. ఈ ఆఫీస్ ద్వారా దస్త్రాన్ని నడపాలన్నారు. వెబ్ ల్యాండ్‌లో ఆ వివరాలు నమోదు చేయాలన్నారు. తిరస్కరించిన వాటికి సంబంధించి క్యాటగిరి వారీగా కారణాలు రాయాలన్నారు.

వెబ్ ల్యాండ్‌లో తేడాలుంటే అప్పీలు చేసుకునేందుకు అవకాశం ఉందని తెలపాలన్నారు.ప్రభుత్వ భూమి ప్రైవేటు భూమి అతుక్కుని ఉంటే దాన్ని విభజించేందుకు అవకాశం త్వరలో రానుందన్నారు. ఇందుకోసం పాత సర్వే నెంబరు, తదితర వివరాలు ఈ ఆఫీస్ ద్వారా పంపించాలన్నారు.భూ నక్ష పోర్టల్‌కు సంబంధించి దశల వారి కరెక్షన్ కు దస్త్రం సరి చేయుటకు సర్వే భూ రికార్డుల ఏడి ద్వారా తహసిల్దార్లు దస్త్రాన్ని తనకు పంపించాలన్నారు. అనాధీన భూములు చుక్కల భూముల చట్ట ప్రకారం సవరణ చేయాలన్నారు. వెబ్లాండు పోర్టల్ తో పాటు సంబంధిత డాక్యుమెంట్లు పరిశీలించిన తర్వాతనే ఉత్తర్వులు జారీ చేయాలన్నారు.పి జి ఆర్ ఎస్ మీకోసం అర్జీలలో 3 శాతం అర్జీలు గడువు దాటి పరిష్కరిస్తున్నారని, 10 శాతం అర్జీలు మరల వస్తున్నాయన్నారు. అర్జీల పరిష్కారంలో నాణ్యత ప్రమాణాలు విధిగా పాటించాలన్నారు. ఉయ్యూరు డివిజన్లో ఎక్కువగా అర్జీలు ఒకే అంశంపై మరలా వస్తున్నాయన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుండి వచ్చే అర్జీలకు ఆలస్యం చేయకుండా పరిష్కారం చూపాలన్నారు. జిల్లా మొత్తంలో 429 అర్జీలు మరల రీ ఓపెన్ వచ్చాయని, అందులో ఒక్కో ఆర్డిఓకు 100కు పైగా అర్జీలు ఉన్నాయన్నారు. ఇంటి స్థలం ఇవ్వకుండానే పౌరులు లబ్ధి పొందినట్లు చూపడం సరికాదని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా పలువురు తహసీల్దారులు వివిధ అంశాలపై లేవనెత్తిన అనుమానాలను జిల్లా కలెక్టర్, సంయుక్త కలెక్టర్ నివృత్తి చేశారు.ఈ సమావేశంలో కేఆర్ఆర్సి ఎస్డిసి శ్రీదేవి గుడివాడ ఉయ్యూరు ఆర్డిఓలు జి బాలసుబ్రమణ్యం బిఎస్ హేలా షారోన్, సర్వే భూమి రికార్డుల ఏడి లక్ష్మణ్, పలువురు తహసిల్దారులు, డీటీలు, సర్వేయర్లు తదితర రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



## ప్రజా సహకారమే..
## నగరాభివృద్ధికి సోపానం

### నగరపాలక సంస్థ కమిషనర్ బాపిరాజు

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ప్రజా సహకారమే నగరాభివృద్ధికి సోపానమని నగర పాలక సంస్థ కమిషనర్ బాపిరాజు అన్నారు. కుటుంబ సర్వేలో భాగంగా నగర కార్పొరేషన్ 45వ డివిజన్‌లో కమిషనర్ బుధవారం సచివాలయ సిబ్బందితో కలిసి సర్వే కార్యక్రమంలో పాల్గొన్నారు. డివిజన్‌లో చాలా కాలం నుండి పెండింగులో ఉన్న ఇంటి పన్నులు, వాటర్ టాక్స్ కార్పొరేషన్‌కు చెల్లించవలసిన బకాయిలు చెల్లించాలని ప్రజలకు సూచించారు. కమిషనర్ మాట్లాడుతూ సకాలంలో కార్పొరేషన్‌కు చెల్లించవలసిన ఇంటి పన్నులు, వాటర్ టాక్స్ చెల్లించి నగర అభివృద్ధికి సహకరించాలని కోరారు. ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. డివిజన్‌లో ఇటీవల ఏర్పాటుచేసిన సబ్ జైల్ డ్రైనేజీని సూపరింటెండెంట్ రమేష్‌తో కలిసి పర్యవేక్షించారు. డివిజన్‌లో ప్రజలు పలుచోట్ల కల్వర్టులు, రోడ్లు వేయాలని కమిషనర్ ను కోరారు. బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్, 45 డివిజన్ ఇన్చార్జ్, పి. వి. ఫణి కుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## పేదలకు అండగా సీఎంఆర్ఎఫ్



**విజయవాడ సెంట్రల్, మేజర్ న్యూస్ :** బుధవారం బీఆర్టీఎస్ రోడ్డులోని సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే కార్యాలయంలో 36వ డివిజన్ సీతన్నపేటకు చెందిన బావిరెడ్డి మధుబాబుకు రూ.47,450లు, కంచి సాయికృష్ణకు రూ.54,395లు విలువ చేసే ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను ప్రభుత్వ విప్, సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు బొండా ఉమా మహేశ్వరరావు లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా బొండా ఉమ మాట్లాడుతూ "ముఖ్యమంత్రి సహాయనిధి నిజంగా పేదలకు అండగా నిలుస్తోంది అని, అత్యవసర పరిస్థితుల్లో వైద్యం చేయించుకోలేని వారికి నిరంతరం చేయూ తనిస్తూ, ఎమ్మెల్యేకార్యాలయంలో ప్రతిరోజూ పూర్తిస్థాయి పారదర్శకతతో ఎలాంటి అవినీతి లేకుండా చెక్కులను అందజేస్తున్నాము అని అన్నారు. అనారోగ్యంతో బాధపడుతూ కార్పొరేట్ స్థాయి వైద్యం పొందలేని బాధితులకు సీఎంఆ రేఫ్ వంతుగా తోడ్పాటును అందిస్తుందని, ప్రభుత్వ ఆసుపత్రులలో కూడా ఇప్పుడు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందుతున్నాయని, ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన వారు తమ వైద్య రసీదులతో సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకుంటే, పరిశీలన అనంతరం కూటమి ప్రభుత్వం అర్హులైన వారికి ముఖ్యమంత్రి సహాయనిధిని అందజేస్తున్నామని అన్నారు. ప్రతి ఒక్కరి ఆరోగ్య పరిరక్షణతో పాటు మెరుగైన సమాజం నిర్మించాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రానికి ఎంతో మేలు చేస్తున్నారు అని, తాము సెంట్రల్ నియోజకవర్గంలోని ప్రతి ప్రజా సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటున్నానని, ఎవరైనా ఏ సమస్యతోనైనా ఎమ్మెల్యే కార్యాలయాన్ని సంప్రదించవచ్చని, ప్రజలకు సేవ చేయడం తన ముఖ్య ధ్యేయమని వారి కష్టసుఖాల్లో పాలుపంచుకోవడం తన బాధ్యత అని అన్నారు. గత 20 నెలల్లో 10 కోట్ల రూపాయలకు పైగా ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేసి వారి ఆర్థిక ఇబ్బందులను తీర్చామని, గతంలో 20142019 మధ్యకాలంలో రూ.35 కోట్ల సీఎంఆర్ఎఫ్ నిధులు ప్రజలకు అందజేసి, అనేక కుటుంబాలకు బలమైన అండగా నిలిచామని, ప్రజా సమస్యల పరిష్కారం అహంకారం కాదుడ అది మా బాధ్యత. జవాబుదారీతనంతో పనిచేయడమే మా పార్టీ లక్ష్యం, ప్రజల సేవే మా ధ్యేయం అని బొండా ఉమా తెలియజేసారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ఘంటా కృష్ణమోహన్, 36వ డివిజన్ అధ్యక్షులు మద్దినేని సుబ్రహ్మణ్యం, ప్రధాన కార్యదర్శి నందేటి లక్ష్మణ్ సింగ్, నాభాని దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ బడిలోనే విద్యార్థులను చేర్పిద్దాం...

**పామర్రు మేజర్ న్యూస్ :** ప్రభుత్వ బడిలోనే విద్యార్థులను చేర్పిద్దాం - మన ఊరి బడిని కాపాడుకుందాం...అనే నినాదంతో గోడపత్రికలను పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా పామర్రు పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) నాయకులు ఎమ్మెల్యే కుమార్ రాజాను కలసి గోడపత్రికలను ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా కుమార్ రాజా మాట్లాడుతూ ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు లంక నరేంద్ర, పి.వి.రమణ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎం.విజయశ్రీ, పూర్వపు జిల్లా కార్యదర్శి ఎం.రవీంద్రప్రసాద్, పామర్రు మండల ప్రధాన కార్యదర్శి శొంఠి అంకరవి, కార్యదర్శులు ఎ.వి. రమేష్, ఎస్.కె.వి.రమేష్, కోటేశ్వరరావు, రామారావు పాల్గొన్నారు.

19 వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999